V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
16-01-2025

సంపుటి : 01 | సంచిక : 254 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## భారత్‌కు క్షమాపణలు చెప్పిన 'మెటా'

- లోక్‌సభ ఎన్నికలపై జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం
- చర్యలకు సిద్ధమైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ
- ఈక్రమంలోనే స్పందించిన మెటా
- అనుకోకుండా జరిగిన పొరపాటును క్షమించాలని రిక్వెస్ట్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీంతో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆయనపై చర్యలకు సిద్ధమైంది. ఈక్రమంలోనే మెటా స్పందిస్తూ.. భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలియజేసింది. అనుకోకుండా జరిగిన పొరపాటును క్షమించాలని కోరింది. జుకర్‌బర్గ్ వ్యాఖ్యలను ఖండిస్తూ కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చేసిన పోస్ట్‌కు

మిగతా3లో...



## సుప్రీంకోర్టులో చంద్రబాబుకు ఊరట

- గత ప్రభుత్వం స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు
- ఇప్పటికే ఛార్జిషీట్ ఫైల్ చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం ఉండదని స్పష్టీకరణ
- అవసరముంటే విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సూచన

**విశ్వంభర, ఢిల్లీ:** సుప్రీంకోర్టులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ ఫైల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు వెల్లడించారు. ఛార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని

మిగతా2లో...



## యుద్ధక్షేత్రంలో బలమైన శక్తిగా భారత్

### దేశరక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి

- నౌకాదళం బలోపేతానికి మరో ముందడుగు
- తొలిసారిగా యుద్ధ నౌకలు ప్రారంభించుకున్నాం
- నేవీ అమ్ములపొదిలో అత్యాధునిక అస్త్రాలు
- ప్రపంచ భద్రత, ఆర్థిక వ్యవస్థల్లో దేశం కీలకపాత్ర
- నౌకాదళం కృషితోనే దేశం సురక్షితం
- ఐఎన్ఎస్ సూరత్, నీలగిరి యుద్ధనౌకలను, జలాంతర్గామి వాఘ్‌షీర్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ



3

# బీఆర్ఎస్ కాదు.. బీఆర్ఎస్ఎస్

## గులాబీ పార్టీకి సీఎం రేవంత్ కొత్త పేరు

- స్వాతంత్ర్యం కోసం ఆర్ఎస్ఎస్ ఏ పోరాటం చేయలేదు
- కాంగ్రెస్ పార్టీ, నేతలు త్యాగాలు చేసి స్వాతంత్ర్యం తీసుకొచ్చారు
- ప్రధాని నరేంద్ర మోడీ మోహన్ భగవత్‌తో ఉన్నారా? లేక దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన లక్షలాది వెంట ఉన్నారా? స్పష్టం చేయాలి
- నిన్న గాక మొన్న వచ్చిన పార్టీలు కార్యాలయాలు నిర్మించుకున్నాయి
- 140 ఏళ్ల చరిత్ర కలిగి కాంగ్రెస్ పార్టీ సొంత కార్యాలయం నిర్మించుకునేందుకు ఇన్నేళ్లు పట్టింది
- తమ పార్టీ ప్రజల కోసం ఎంత నిస్వార్థంగా పని చేస్తుందో దీన్నే బట్టే అర్థం చేసుకోవాలి
- తెలంగాణలో చట్టం తన పద్ధతిలో నడిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ అంటే.. 'బీ-ఆర్ఎస్ఎస్' అని, ఆర్ఎస్ఎస్ ఐడియాలజీతో వెళ్లేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ చేస్తోన్న ఆరోపణలనే తెలంగాణలో బీఆర్ఎస్ చేస్తోందని విమర్శించారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ చెప్పినట్లు ఆర్ఎస్ఎస్‌తో తమది సిద్ధాంతపరమైన వైరుధ్యమన్నారు. స్వాతంత్ర్యం కోసం ఆర్ఎస్ఎస్ ఏ పోరాటం చేయలేదని ఆరోపించారు. స్వాతంత్ర్యం గురించి ప్రశంసించేందుకు, చెప్పేందుకు వారు సిద్ధంగా లేరని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మోహన్ భగవత్ అదే చెప్పారని, స్వాతంత్ర్య పోరాటంతో వాళ్లకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ, నేతలు త్యాగాలు చేసి స్వాతంత్ర్యం

మిగతా2లో...

## తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- ప్రస్తుత సీజే ఆలోక్ అరాధే బాంబే హైకోర్టుకు బదిలీ



2



2

## ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఘనంగా సంక్రాంతి సంబురాలు

స్వయంగా ముగ్గులు వేసిన ఎమ్మెల్సీ కవిత

## ఏసీబీ వలలో మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్

- ఇంటిస్థలం సేల్‌డీడ్, మార్టిగేజ్ కోసం రూ.10వేలు లంచం డిమాండ్
- రూ.5వేలు లంచం తీసుకుంటుండగా వలపన్ని పట్టుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు



2



## అసెంబ్లీ ఎన్నికల వేళ కేజ్రీవాల్‌కు షాక్

- ఈడీ విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం
- మరోసారి కేజ్రీవాల్‌ను విచారించేందుకు సిద్ధమవుతోన్న ఈడీ

**ఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం షాకిచ్చింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన్ని విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతులు మంజూరు చేసింది. ప్రజాప్రతినిధుల్ని విచారించాలంటే ఈడీ ముందుగా అనుమతి తీసుకోవాలని సుప్రీంకోర్టు గతేడాది నవంబర్‌లో ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేజ్రీవాల్‌ను విచారించేందుకు

మిగతా2లో...

# కేటీఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు





### ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

- క్వాష్ పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీం కోర్టు
- హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
- కేసు దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందని వ్యాఖ్య
- ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో పిటిషన్ కొట్టివేత
- నేడు ఈడీ విచారణపై ఉత్కంఠ..

**విశ్వంభర, హైదరాబాద్:**

పండుగ పూట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సుప్రీ కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లె ధర్మాసనం విచారణ జరిపింది. కేసులో పూర్తి స్థాయిలో విచారణ జరగాలని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. హైకోర్టు ఆదేశాల్లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో క్వాష్ పిటిషన్‌ను కేటీఆర్ విత్ డ్రా చేసుకున్నారు. ఈ మేరకు గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్

మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 112 | రిటైల్ ₹ 134 |
| స్కిన్ ₹ 194 | స్కిన్ లెస్ ₹ 221 |

## అంతేగా!





## టీజీ ఎప్‌సెట్ తేదీలు ఖరారు

- మే 2 నుంచి 5 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు
- తెలంగాణ ఉన్నత విద్యామండలి కీలక ప్రకటన విడుదల



2

# టీజీ ఎప్‌సెట్ తేదీలు ఖరారు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఉన్నత విద్యామండలి కీలక ప్రకటన విడుదల చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు పరీక్ష తేదీలను ఉన్నత విద్యామండలి వెల్లడించింది. బీఈ, బీటెక్, బీ ఫార్మసీ, ఫార్మ్ డీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలను ఏప్రిల్, మే నెలలో నిర్వహించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులకు సంబంధించి ఏప్రిల్ 29, 30 తేదీల్లో, ఇంజినీరింగ్ కోర్సులకు మే 2 నుంచి 5వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. టీజీ ఈసెట్ ప్రవేశ పరీక్షను మే 12, టీజీ ఎడ్‌సెట్‌ను జూన్ 1, టీజీ లాసెట్, ఎల్ఎల్ఎం కోర్సులకు జూన్ 6, ఐసెట్ పరీక్షలను జూన్ 8, 9 తేదీల్లో, టీజీ పీజీఈసెట్ పరీక్షలను జూన్ 16 నుంచి 19 వరకు, టీజీ పీఈసెట్ ప్రవేశ పరీక్షలను జూన్ 11 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి ప్రకటించింది.

# తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు సీజేగా బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే బాంబే హైకోర్టు సీజేగా బదిలీ అయ్యారు.

**పలు రంగాల్లో సేవలు..**

1964 జూన్ 21న జస్టిస్ సుజయ్‌పాల్ జన్మించారు. బీకాం, ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలు అందించారు. 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పనిచేశారు. 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయన హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.

# ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఘనంగా సంక్రాంతి సంబురాలు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సంప్రదాయం ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహించారు. స్వయంగా ఎమ్మెల్సీ కవిత స్వయంగా ముగ్గులు వేసి సంక్రాంతి వేడుకల్లో పాలుపంచుకున్నారు. రాష్ట్ర ప్రజలు, రైతాంగం.. పాడిపంటలు, సిరి సంపదలు, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కవిత ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సుప్రీంకోర్టులో చంద్రబాబుకు ఊరట




**మొదటిపేజీ తరువాయి**

జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం పేర్కొంది. గత ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీంకోర్టు సూచించింది. 2023 నవంబరులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్ దాఖలు చేసిన ఓ పత్రిక విలేకరి బాల గంగాధర్ తిలక్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరెవరు..? మీకేం సంబంధం..? పిల్ దాఖలు చేయడానికి ఉన్న అర్హత ఏంటి..? అని ప్రశ్నించింది. బెయిల్ వ్యవహారాల్లో మూడో వ్యక్తి ఎందుకు ఉంటారని ధర్మాసనం నిలదీసింది. సంబంధం లేని బెయిల్ వ్యవహారాల్లో పిటిషన్ ఎలా వేస్తారని జస్టిస్ బేలా త్రివేది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఇంకోసారి జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని విలేకరిని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్‌ను డిస్మిస్ చేసింది.

# ఖమ్మం పత్తి మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

- మార్కెట్ యార్డ్ షెడ్‌లో తగలబడిన పత్తి బస్తాలు
- భారీగా ఎగసిపడిన మంటలు
- అగ్నికి ఆహుతైన 400 పత్తి బస్తాలు

**విశ్వంభర, ఖమ్మం:** ఖమ్మం పత్తి మార్కెట్‌లో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు అంటుకుని దాదాపు 300 పత్తి బస్తాలు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పత్తి మార్కెట్‌కు ఈనెల 16వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఉన్నాయి. సంక్రాంతికి ముందు కొందరు వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని మార్కెట్ యార్డులో ఉంచారు. అయితే వ్యవసాయ మార్కెట్‌లో ఓ వ్యాపారికి చెందిన పత్తి సుమారు 200 బస్తాల అగ్నికి ఆహుతి కావటం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. హుటాహుటిన మార్కెటింగ్, ఫైర్ అధికారులతో మాట్లాడి తక్షణమే నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో.. వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మార్కెట్ అగ్ని ప్రమాదంలో కాలిన పత్తి బస్తాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మంటలను అదుపు చేసేందుకు రెండు ఫైర్ ఇంజన్‌లు రంగంలోకి దిగాయి. కాలిపోయిన పత్తి విలువ లక్షల్లో ఉంటుందని ట్రేడర్లు అంటున్నారు. కాలిపోయిన పత్తి పాండురంగ, శ్రీను అనే వ్యక్తులదిగా పోలీసులు గుర్తించారు.

# కోతలు లేకుండా రూ.12 వేలు ఇవ్వాలి

- ఆత్మీయ భరోసాకు షరతులు విధించొద్దు
- గుంట భూమి ఉన్న రైతులను కూలీలుగా గుర్తించకపోవడం శోచనీయం
- రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఈ పథకం అమలు చేయాలి
- గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలి
- పూర్తికాని ఇళ్లకు నిధులు విడుదల చేయాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**విశ్వంభర, సిద్దిపేట:** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్నికోతలు విధించకుండా అమలు చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉన్నాయని, కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల ఎక్కువగా ఉంటారని చెప్పారు. రాష్ట్రంలో కోటి 2 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్నారని తెలిపారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధిహామీ కూలీలుగా గుర్తించమని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమన్నారు. ఒక్క సెంటు భూమి ఉన్నా కూలీ కాదని అంటున్నారని, ఉపాధిహామీ పథకంలో ఈ ఏడాది 20రోజులు పని దినాలు ఉంటేనే కూలీగా గుర్తింపు ఉంటుందనే నిబంధన కూడా సరైంది కాదన్నారు. అనారోగ్య సమస్యలు, ఇతర సమస్యలతో పనికి వెళ్లని కూలీలను ఉపాధిహామీ కూలీలుగా గుర్తించమని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించుకొని రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**గ్రామ సభల ద్వారానే ఎంపిక..**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు ప్రకటించాలన కోరారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వం చెప్పిందని, కానీ లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు విడుదల చేయలేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లాలో 68 వేల దరఖాస్తులు వచ్చాయని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ సభలు పెట్టి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసిందని చెప్పారు. గ్రామసభలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరై అయిన వారు కొంత నిర్మించుకొని ఉన్నారని, ఇళ్లను పూర్తి చేసుకోడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. వెంటనే నిధులు విడుదల చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

**ఎగ్గొట్టడమే కాంగ్రెస్ నైజం..**

ఐదు గుంటలు ఉన్న రైతుకు ఏడాదికి రైతు భరోసా కింద రూ.1500 మాత్రమే వస్తాయని, ఐదు గుంటలు ఉన్న రైతుకు వ్యవసాయ కూలీ కింద రూ.12000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నష్టపోతారని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులు.. తాతకు ఎకరం భూమి ఉంటే పిల్లలు పంచుకుంటే అది ఐదు గుంటలు వస్తాయని, 5 గుంటలో పంట పండింది లేదని, వారు బతికింది లేదన్నారు. 5 గుంటలు ఉన్నందుకు రూ.12 వేలు ఇవ్వమని ప్రభుత్వం చెప్పడం శోచనీయమన్నారు. రైతుభరోసా కింద ప్రభుత్వం ఇస్తున్నది రూ.1500 అయితే ఎగ్గొట్టేది రూ.12వేలు అని ఆరోపించారు. రాష్ట్రంలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులు 24 లక్షల 57,000 మంది ఉన్నారని, గుంట, రెండు గుంటలు ఉన్న రైతులు రైతుభరోసా తీసుకోవడం వల్ల రైతు కూలీలకు ఇచ్చే రూ.12,000 నష్టపోతారని చెప్పారు. ఇలాంటి రైతులకు రైతు భరోసా కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా గుర్తించాలని సూచించారు. ఈజీఎస్ పథకంలో కూలీలు 60 ఏండ్ల వయసు దాటితే కార్డు కోల్పోతారని, అందుకు ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలన్నారు.

# ఏసీబీ వలలో మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్



**విశ్వంభర, మెట్‌పల్లి:** స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన ఓ అవినీతి చేప ఏసీబీకి చిక్కింది. ఇంటిస్థలం సేల్‌డీడ్, మార్టిగేజ్ కోసం రూ.10వేలు లంచం డిమాండ్ చేసి, రూ.5వేలు తీసుకుంటూ బుధవారం అడ్డంగా దొరికిపోయారు. డబ్బులు తీసుకున్న కార్యాలయ అటెండర్, దస్తావేజులేఖరితోపాటు సబ్‌రిజిస్ట్రార్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయడం, జగిత్యాల జిల్లాలో కలలం రేపింది. ఏసీబీ కరీంనగర్ డీఎస్పీ రమణామూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుంకే విష్ణు అనే బ్యాంకు ఉద్యోగి మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో 266 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ఇంటి స్థలం సేల్‌డీడ్, మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ కోసం దస్తావేజు లేఖరి (డాక్యుమెంట్ రైటర్)తో దస్తావేజులను (డాక్యుమెంట్)తయారు చేయించారు. నెల 28న దస్తావేజు లేఖరి వద్ద సహాయకుడిగా పనిచేసే ఆర్మూరు రవి సబ్‌రిజిస్ట్రార్ వద్దకు సదరు దస్తావేజులను తీసుకెళ్లాడు. సేల్‌డీడ్, మార్టిగేజ్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు రూ.10 వేలు ఇవ్వమని సబ్‌రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. అయితే విష్ణు డబ్బులు ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయకుండా పక్కన పెట్టారు. లంచం అంత ఇచ్చుకోలేనని, రూ.5వేలు ఇస్తానని విష్ణు చెప్పడంతో రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ అంగీకరించారు. కాగా, సేల్‌డీడ్, మార్టిగేజ్ కోసం అన్ని సక్రమంగా ఉండి కూడా లంచం ఇచ్చేందుకు ఇష్టపడని అతను, ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఈ క్రమంలో డీఎస్పీ రమణామూర్తి ఆధ్వర్యంలో ఏసీబీ కార్యాలయంపై నిఘా పెట్టారు. దస్తావేజులేఖరి సహాయకుడి ద్వారా రూ.5 వేలు లంచం డబ్బులు సబ్‌రిజిస్ట్రార్ వద్దకు తీసుకెళ్లగా, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్న బానోతు రవికుమార్‌కు ఇవ్వమని సూచించారు. సబ్‌రిజిస్ట్రార్ చెప్పినట్లుగానే అటెండర్‌కు డబ్బులు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వెంటనే సబ్‌రిజిస్ట్రార్, అటెండర్‌తో పాటు దస్తావేజులేఖరి సహాయకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ముగ్గురి నిందితులను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వివరించారు.

# కేటీఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు

**మొదటిపేజీ తరువాయి**

డైరెక్టరేట్ చేపట్టే విచారణకు కేటీఆర్ హాజరుకానున్నారు.

**అడ్వొకేట్ వాదనలు..**

సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట కేటీఆర్ తరఫున అడ్వొకేట్ సుందరం వాదనలు వినిపించారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు అని తెలిపారు. ఇందులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని వాదించారు. ఇది ప్రభుత్వ ప్రాజెక్టు అన్నారు. కేసుకు అవినీతి నిరోధక చట్టం గుర్తించదన్నారు. డబ్బు తీసుకున్నవారిని, హెచ్ఎండీఏను నిందితులుగా చేర్చలేదని సుందరం పేర్కొన్నారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం తరఫున ముకుల్ రొహత్గి వాదనలు వినిపించారు. కేసులో దర్యాప్తు జరగాలని విజ్ఞప్తి చేశారు. 24 గంటల్లో కేసు కొట్టేయాలని పిటిషన్ వేశారని గుర్తుచేశారు. గవర్నర్ దర్యాప్తునకు కూడా అనుమతి ఇచ్చారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**ఏ1గా కేటీఆర్..**

ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ1గా చేర్చింది. దీంతో ఏసీబీ కేసును క్వాష్ చేయాలని మంత్రి కేటీఆర్ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించడంతో అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. కేసును క్వాష్ చేసేందుకు నిరాకరించింది. దీంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. హైకోర్టు తీర్పును సవాల్ చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో తాజాగా విచారణ జరిగింది. కాగా, ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరోసారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ముగ్గురిని ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే.

**నేడు ఈడీ విచారణపై ఉత్కంఠ..**

ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న కేటీఆర్‌ను గురువారం ప్రశ్నించనుంది. ఏ 2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్‌ను, ఏ3గా ఉన్న హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను అధికారులు విచారించి వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఏసీబీ ఎదుట ఇప్పటికే హాజరైన కేటీఆర్ ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో నిధుల బదిలీ తన ఆదేశాల మేరకు జరిగాయని దర్యాప్తు అధికారులకు చెప్పినట్లు తెలిపారు. మరి నేటి ఈడీ విచారణలోనూ ఇదే విషయాన్ని ఆయన చెబుతారా లేక మరేదైనా కొత్త అంశాన్ని చెబుతారా అనేది సస్పెన్స్‌గా మారింది.

# అసెంబ్లీ ఎన్నికల వేళ కేజ్రీవాల్‌కు షాక్

**మొదటిపేజీ తరువాయి**

ఈడీ గత నెల లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను అనుమతి కోరింది. ఈడీ అభ్యర్థనకు ఎల్జీ ఆమోదం తెలిపారు. దీంతో ఈ విషయాన్ని ఈడీ అధికారులు కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లగా.. కేజ్రీని విచారించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక కేజ్రీవాల్‌తోపాటు ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను కూడా విచారించేందుకు కేంద్ర హోం శాఖ అనుమతి ఇచ్చింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో గతేడాది మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఈడీ సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. జూలై 12న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సీబీఐ అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది. ఇక సెప్టెంబర్ 13న సీబీఐ కేసులోనూ కేజ్రీకి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ దక్కడంతో ఆరునెలల పాటు జైలుజీవితం గడిపిన ఆయన చివరికి సెప్టెంబర్ 14వ తేదీన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులోనే ఈడీ మరోసారి కేజ్రీవాల్‌ను విచారించేందుకు సిద్దమవుతోంది.

# హైకోర్టు జడ్జిలుగా ఆరుగురి పేర్లు

- సిఫార్సు చేసిన సుప్రీం కొలీజియం
- తెలంగాణ హైకోర్టుకు నలుగురు, ఏపీ హైకోర్టుకు ఇద్దరు
- జ్యుడీషియల్ ఆఫీసర్ల కోటాలో సిఫార్సు

**విశ్వంభర, ఢిల్లీ:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులకు జడ్జిలుగా పలువురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టుకు నలుగురు, ఏపీ హైకోర్టుకు ఇద్దరి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టుకు వై.రేణుక, నందికొండ నర్సింగరావు, తిరుమల దేవి, మధుసూదన్ రావు.. ఏపీ హైకోర్టుకు హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు పేర్లు సిఫార్సు చేసింది. జ్యుడీషియల్ ఆఫీసర్ల కోటాలో ఈ ఆరుగురు పేర్లను కొలీజియం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.



# బీఆర్ఎస్ కాదు.. బీఆర్ఎస్ఎస్



**మొదటిపేజీ తరువాయి**

తీసుకొచ్చారని, దేశాన్ని ముందుకు నడిపించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాహుల్ చెప్పారని సీఎం వివరించారు. బీజేపీ చెబుతున్న విషయాలపై ఎక్కువ దృష్టి పెట్టాల్సిన పనిలేదన్నారు.

**మోదీ మోహన్ భాగవత్‌తో ఉన్నారా?**

ప్రధాని నరేంద్ర మోదీ మోహన్ భాగవత్‌తో ఉన్నారా? లేక దేశ స్వాతంత్య్రం కోసం అమరులైన లక్షలాది వెంట ఉన్నారా? స్పష్టం చేయాలని రేవంత్ డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ స్వాతంత్య్రం విషయంలో మోహన్ భాగవత్ మాట్లాడిన అంశాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మోదీ భాగవత్‌పై చర్యలు తీసుకుంటారా లేదా దేశ ప్రజలకు స్పష్టం చేయాలని సీఎం డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి తాము నేర్చుకోవాల్సింది ఏం లేదని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణలో చట్టం తన పద్ధతిలో నడిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని స్పష్టం చేశారు. ఎక్కడైనా దాడులు జరిగితే పోలీసులు చర్యలు చేపడతారని, శాంతిభద్రతల సమస్య తలెత్తితే పోలీసులు జోక్యం చేసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. గత ప్రభుత్వం హయాంలో పోలీసులతో కలిసి బీఆర్ఎస్ వాళ్లు కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు చేశారని, తాము అలా చేయడం లేదని సీఎం రేవంత్ తెలిపారు.

**కాంగ్రెస్‌కు బీజేపీకి అదే తేడా..**

140 ఏళ్ల చరిత్ర కలిగి కాంగ్రెస్ పార్టీ సొంత కార్యాలయం నిర్మించుకునేందుకు ఇన్నేళ్లు పట్టిందని, అదే నిన్నగాక మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలు 40ఏళ్ల సినియార్టీ మాత్రమే ఉన్న బీజేపీ స్వల్పకాలంలోనే కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని రేవంత్ అన్నారు. తమ పార్టీ ప్రజల కోసం ఎంత నిస్వార్థంగా పని చేస్తుందో దీన్నే బట్టే అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీ, ఇతర ప్రాంతీయ పార్టీల ఆర్థికస్థితిగతులు, కాంగ్రెస్ పార్టీ ఆర్థిక స్థితిగతి ఎలా ఉందో గమనించాలన్నారు. రాబోయే రోజుల్లో ఇక్కడి నుంచి దేశాభివృద్ధి అవసరమైన నిర్ణయాలు, ప్రణాళికలు రచించబడతాయన్నారు.

**కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యనేతల కీలక సమావేశం**

ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో తెలంగాణ ముఖ్యనేతల కీలక సమావేశం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. సుమారు గంటన్నరపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

**ఫిబ్రవరిలో రాహుల్‌గాంధీ సభ..**

ఫిబ్రవరి తొలి లేదా రెండో వారంలో రాష్ట్రంలో రాహుల్ గాంధీ సభ ఉంటుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. 'సూర్యాపేట లేదా ఖమ్మంలో రాహుల్ ఉండే అవకాశ ఉంది. ఈ నెలాఖరులోపు నామినేటెడ్, కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీ ఉంటుంది. కేబినెట్ విస్తరణపై సీఎం, అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చించాం. ప్రజల్లో ఉన్నవారికే డీసీసీ అధ్యక్ష పదవులు' ఇస్తాం అని మహేశ్ కుమార్ తెలిపారు.




# భారత్‌కు క్షమాపణలు చెప్పిన 'మెటా'

**మొదటిపేజీ తరువాయి**

మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ శివానంద్ టుక్‌రాల్ స్పందించారు. ''2024లో జరిగిన ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీలు మళ్లీ విజయం సాధించలేదంటూ మార్క్ చేసిన వాదన చాలా దేశాల్లో నిజమే కానీ భారత్‌లో మాత్రం కాదు. అనుకోకుండా జరిగిన ఈ పొరపాటుకు క్షమాపణలు తెలియజేస్తున్నాం. మెటాకు భారత్ అతి ముఖ్యమైన భాగస్వామి. ఈ దేశ సృజనాత్మక భవిష్యత్తులో మేమూ కీలక పాత్ర పోషించేందుకు ఎదురుచూస్తున్నాం'' అని రాసుకొచ్చారు.

**వాస్తవాలు, విశ్వసనీయతను కాపాడుకుందాం..**

ప్రపంచవ్యాప్తంగా గతేడాది జరిగిన ఎన్నికల అంశాన్ని జుకర్‌బర్గ్ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ''2024 అతిపెద్ద ఎన్నికల ఏడాదిగా నిలిచింది. భారత్ సహా అనేక దేశాల్లో ఎన్నికలు జరిగాయి. అందులో ప్రతి చోటా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఓడిపోయాయి. అది ద్రవ్యోల్బణం వల్ల కావొచ్చు. లేదా కొవిడ్‌ను ఎదుర్కోవడానికి తీసుకొచ్చిన ఆర్థిక విధానాల వల్ల కావొచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రభావం కన్పించింది'' అని మెటా అధినేత వ్యాఖ్యానించారు. దీంతో ఇది కాస్తా పెను వివాదానికి దారితీసింది. జుకర్‌బర్గ్ వాదనను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తీవ్రంగా ఖండించారు. ''ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో 2024లో నిర్వహించిన ఎన్నికల్లో 64కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంపై విశ్వాసం ఉందని తేల్చిచెప్పారు. కొవిడ్-19 తర్వాత భారత్ సహా అధికారంలో ఉన్న అనేక ప్రభుత్వాలు ఓడిపోయాయని జుకర్‌బర్గ్ చెప్పడంలో వాస్తవం లేదు. 80 కోట్ల మందికి ఉచిత ఆహారం మొదలు 220కోట్ల వ్యాక్సిన్లు అందించడంతోపాటు కొవిడ్ సమయంలో ప్రపంచ దేశాలకు భారత్ సాయం చేయడం వంటి నిర్ణయాలు మోదీ మూడోసారి విజయానికి నిదర్శనంగా నిలిచాయి'' అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. స్వయంగా జుకర్‌బర్గ్ నుంచి ఇలాంటి అసత్య సమాచారం రావడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్న కేంద్రమంత్రి.. వాస్తవాలు, విశ్వసనీయతను కాపాడుకుందామంటూ మెటాను ట్యాగ్ చేశారు. ఈ క్రమంలోనే మెటా స్పందిస్తూ భారత్‌కు క్షమాపణలు తెలియజేసింది.



# పౌరుషాల పట్టు.. జల్లికట్టు

- చిత్తూరు జిల్లా రంగంపేటలో ప్రారంభం
- గ్రామ వీధుల్లో కోడెద్దులు రంకెలు
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- బహుమతుల కోసం యువకుల పోటీ
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాహస క్రీడ
- తమిళనాడు తరహాలోనే నిర్వహణ

**విశ్వంభర, చిత్తూరు:** చిత్తూరు జిల్లా రంగంపేటలో పౌరుషాల పట్టు.. జల్లికట్టు పోటీలు ప్రారంభమయ్యాయి. ఏటా కనుమ పండుగ రోజున జల్లికట్టు వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జల్లికట్టు కోసం సిద్ధం చేసిన కోడెద్దులు గ్రామ వీధుల్లో రంకెలు వేశాయి. చంద్రగిరి నియోజకవర్గంతోపాటు తిరుపతి, పీలేరు నియోజకవర్గాల్లోని గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివచ్చి జల్లికట్టును తిలకించారు. జల్లికట్టు పోటీల్లో పశువులకు ప్రత్యేకంగా అమర్చిన బహుమతి పలకలతో కూడిన పౌరుషాల కోడె ఎద్దులను రంగంపేటలోని వీధుల్లో వదిలిపెట్టారు. యువకులు ఎదురెళ్లి వాటిని లొంగ తీసుకుని పలకల బహుమతులను తమ సొంతం చేసుకునేందుకు పెద్దసంఖ్యలో పోటీలు పడ్డారు. ఎవరైతే ఎద్దులను లొంగదీసుకుని వాటికి కట్టిన పలకలను సొంతం చేసుకుంటారో వారే జల్లికట్టు పోటీల్లో విజేతలుగా ప్రకటించారు.

## హీరోల, రాజకీయ పార్టీ నాయకుల బొమ్మలు..

తమకు నచ్చిన సినిమా హీరోల, రాజకీయ పార్టీ నాయకుల బొమ్మలను పలక మీద అలంకరించి నగదు, బంగారు, వెండి వంటి విలువైన బహుమతులను మూట కట్టి జల్లికట్టులో వదిలారు. విలువైన పలకల బహుమతులను దక్కించుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. బహుమతులను గెలుచుకునేందుకు తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోనసీమ ప్రాంతాలలో కోడి పందాలు నిర్వహిస్తే, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో జల్లికట్టు నిర్వహిస్తారు. కోడిగిత్తల రంకెలు.. హుషారెత్తే యువకులతో పల్లెల్లో సంక్రాంతి సంబురాలు జల్లికట్టుతో కొనసాగుతాయి. ఇదిలా ఉండగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జల్లికట్టు సాహస క్రీడ అనాదిగా కొనసాగుతోంది. తమిళనాడు తరహాలో జల్లికట్టు నిర్వహించడం ఆనవాయితీ. ప్రమాదకరమైన జల్లికట్టును అడ్డుకోవడం కోసం పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా, దశాబ్దాలుగా కొనసాగుతోంది. జల్లికట్టు పోటీల్లో అనేకమంది గాయాల పాలవుతున్నా ఆట మాత్రం ఆగడం లేదు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలను కూడా పోగొట్టుకుంటారు. జల్లికట్టు పోటీలను నిర్వహించినప్పుడు గాయపడిన వారికి వెంటనే ప్రథమ చికిత్స చేయడానికి వైద్య బృందాన్ని సిద్ధం చేసుకుంటారు. జల్లికట్టు పోటీలకు భార్య మౌనికతో కలిసి మంచు మనోజ్ హాజరవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# చట్టం ప్రకారం నీటి కేటాయింపులు జరగాల్సిందే

- రాష్ట్రానికి నీటి కేటాయింపులపై వాదనలు బలంగా వినిపించాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రానికి రావాల్సిన నీటి కేటాయింపులపై కృష్ణా ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. నీటి కేటాయింపులపై కేడబ్ల్యూడీటీ ముందు బలమైన వాదనలు వినిపించాలన్నారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలుపుతూ ఏపీ సీఎం, కేంద్ర జల్‌శక్తి శాఖ, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీకి లేఖలు రాయాలని సూచించారు. ఏ నదిపైనైనా ప్రాజెక్టు నిర్మించాలంటే పొరుగు రాష్ట్రం అనుమతి తీసుకోవాలని, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం పొరుగురాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని వివరించారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా భద్రాచలం ముంపునకు గురయ్యే అవకాశాలపై ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయించామని, పలు ప్రాజెక్టుల అనుమతులు సాధించే పనులను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి, నీటిపారుదల శాఖ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడు అరెస్ట్

- తుపాకులు, బుల్లెట్లు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన సుధీర్‌బాబు



**విశ్వంభర, హైదరాబాద్:** ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణను అరెస్టు చేసినట్లు సీపీ వెల్లడించారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను సీపీ మీడియాకు వెల్లడించారు. నిందితుడు హరేకృష్ణ హైదరాబాద్‌లో తుపాకులు విక్రయిస్తున్నాడని, అతని వద్ద నుంచి తుపాకులు, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

# రాష్ట్రంలో 4 కొత్త పథకాలు

## నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక.. కలెక్టర్లకు సీఎస్ కీలక సూచనలు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న నాలుగు కొత్త పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. గ్రామ పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల ఎంపికపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు భరోసా కోసం భూముల వివరాలను రెవెన్యూ శాఖ ద్వారా వ్యవసాయ శాఖకు పంపించినట్లు సీఎస్ తెలిపారు. ''క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగుయోగ్యం కాని భూములను గుర్తించాలి. వాటి వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించాలి. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కోసం కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులకు వెళ్లిన భూమి లేని రైతు కూలీల కుటుంబాలను గుర్తించి.. ఆ జాబితాను గ్రామ సభల్లో ప్రకటించాలి. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో వివరించి ఆమోదం పొందాలి. అభ్యంతరాలుంటే స్వీకరించాలి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున.. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి'' అని కలెక్టర్లకు సీఎస్ సూచనలు చేశారు.

# సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణకు సహకరించండి

- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన మంత్రి శ్రీధర్‌బాబు
- తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు



**విశ్వంభర, హైదరాబాద్:** సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణకు సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు.. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ప్రత్యేకంగా కలిశారు. తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీకి ముందుకొచ్చే పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలను కేంద్ర మంత్రికి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. పలు ప్రముఖ సంస్థలు తెలంగాణలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయని, ఇలాంటి తరుణంలో డేటా భద్రత కీలకంగా మారిందన్నారు. అందుకే 'నేషనల్ డిజాస్టర్ రికవరీ జోన్' ఏర్పాటు చేయాల్సి ఉందని ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని కోరారు.



# అది నిజమని నిరూపిస్తే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..

- రేవంత్ రెడ్డికి పాడి కౌశిక్ రెడ్డి సవాల్

**విశ్వంభర, హైదరాబాద్:** కరీంనగర్ జిల్లా రివ్యూ మీటింగ్‌లో కరీంనగర్ ఆర్డీవో విధులకు ఆటంకం కలిగించినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు. నేను ఏ ఒక్క తప్పు చేసినా నన్ను ఉరి తీయండి.. చావడానికి రెడీగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. చుమ్మా మినిస్టర్‌వి. అసలు నీకు దమాక్ ఉందా..? కోర్టుకు పోగానే జడ్జి బెయిల్ ఇచ్చి బయటకు పంపిండు. బేకర్ కేసులు అని తిట్టిండు. నన్ను కలెక్టర్ పిలిస్తే పోయాను. కరీంనగర్ ఆర్డీవోతో నా మీద పిటిషన్ వేయించారు. ఆర్డీవో ఎట్ల ఉంటడో కూడా తెలియదు. నా జీవితంలో ఆయనతో మాట్లాడలేదు. ఆయన డ్యూటీకి ఆటంకం కలిగించినట్లు ఫిర్యాదు చేశారు. నేను ఛాలెంజ్ చేస్తున్నా.. ఆర్డీవోను డిస్టర్బ్ చేయించినట్టు ఒక్క వీడియో క్లిప్ చూపిస్తే.. నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాను. నేను ఏ ఒక్క తప్పు చేసినా నన్ను ఉరి తీయండి.. చావడానికి రెడీగా ఉన్నా.. తెలంగాణ ప్రజలు, రైతుల కోసం. కానీ అన్యాయంగా కేసులు పెట్టి.. లోపల నూకి ఇబ్బంది పెడుదామనుకుంటే, భయపడి కౌశిక్ రెడ్డి మాట్లాడడు అనుకుంటే.. మిస్టర్ రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకో.. దిస్ ఈజ్ కౌశిక్ రెడ్డి.. అందరి కంటే మంచిగా నీకు తెలుసు నా సంగతి. నువ్వు ఎంత ఎక్కువ చేస్తే.. నేను ఇంకా ఎక్కువ చేస్తా.. భయపడే ప్రసక్తే లేదు. ఇది కేసీఆర్ ట్రైనింగ్ ఇచ్చినా బిడ్డరా కౌశిక్ రెడ్డి అంటే.. రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకో. మాది భయపడే రక్తం కాదు.. ప్రశ్నిస్తూనే ఉంటాం.. ఆరు గ్యారెంటీలు అమలు చేసే దాకా నిన్ను అడుగుతనే ఉంటాం.. కడుగుతునే ఉంటాం.. నిన్ను వదిలిపెట్టం అని రేవంత్ రెడ్డిని పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు.

# యుద్ధక్షేత్రంలో బలమైన శక్తిగా భారత్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ప్రధాన నౌకాదళ శక్తిగా భారత్ అవతరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రపంచదేశాలు భారత్‌ను విశ్వసనీయ, బాధ్యతాయుత భాగస్వామిగా చూస్తున్నాయన్నారు. 77వ సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం ముంబైలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడారు. అంతకుముందు రెండు యుద్ధనౌకలను ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. యుద్ధ నౌకలతో నౌకదళ బలం మరింత పటిష్టం కానుందని చెప్పారు. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. భారత్ లక్ష్యసాధనకు ఇది పెద్ద ముందడుగుగా నిలిచిందన్నారు. దేశ రక్షణలో సైనికుల సేవలు ఎనలేనివని మోదీ కొనియాడారు. దేశ భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడుతున్నారని తెలిపారు. నౌకాదళం బలోపేతానికి నేడు మరో ముందడుగు పడిందన్నారు. తొలిసారిగా రెండు యుద్ధ నౌకలు, జలాంతర్గామిని ఒకేసారి ప్రారంభించుకున్నామన్నారు. ఇవన్నీ దేశంలోనే తయారైనే అన్నారు. వీటితో నౌకాదళానికి నూతన బలం, దార్శనికత అందుతుందని వివరించారు.

**రక్షణరంగ బలోపేతానికి కృషి..**

సముద్ర తీర రక్షణకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. గత పదేళ్లలో 33 యుద్ధ నౌకలు, ఏడు జలాంతర్గాములు నేవీలో చేరాయన్నారు. రక్షణరంగ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.25 లక్షల కోట్లు దాటిందన్నారు. మన రక్షణ పరికరాలను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నామని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, ఉగ్రవాదం నుంచి సముద్రతీరాలను రక్షించడంలో మనం ప్రపంచ భాగస్వామిగా మారాలని ప్రధాని పిలుపునిచ్చారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఐఎన్ఎస్ సూరత్ యుద్ధ నౌకలో ప్రాజెక్ట్ 15ఏ, ప్రాజెక్ట్ 15బీ డెస్ట్రాయర్లు ఉన్నాయని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి వెల్లడించారు. ఐఎన్ఎస్ నీల్‌గిరి యుద్ధనౌకలో ప్రాజెక్ట్ 17ఏ ఫ్రిగేట్లు ఉన్నాయని, వీటిని కలిగిన తొలి భారత యుద్ధనౌక ఇదేనని చెప్పారు. ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ యుద్ధనౌకలో ప్రాజెక్ట్ 75 జలాంతర్గాములు (సబ్ మెరైన్లు) ఉన్నాయన్నారు. మూడు యుద్ధ నౌకల చేరికతో భారత నౌకాదళం సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. హిందూ మహాసముద్రంలో దేశ ప్రయోజనాలను కాపాడే క్రమంలో నౌకాదళం చేపట్టే ఆపరేషన్లకు ఈ యుద్ధ నౌకలు దోహదం చేస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డెస్ట్రాయర్ యుద్ధ నౌక..**

పీ15బీ గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేసిన నాలుగో యుద్ధనౌక ఐఎన్ఎస్ సూరత్. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డెస్ట్రాయర్ యుద్ధ నౌకల్లో ఇదొకటి. ఇందులో వాడిన టెక్నాలజీలో 75 శాతం మన దేశానిదే. ఈ యుద్ధ నౌకలో అధునాతన ఆయుధ సెన్సార్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం. అలాగే పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన తొలి యుద్ధనౌక ఐఎన్ఎస్ నీలగిరి. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారు. దీంతో పాటు పీ75 ప్రాజెక్టులో భాగంగా రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.



# తెలంగాణ గర్వించదగ్గ రాజకీయ మేధావి

# సూదిని జైపాల్ రెడ్డి

## జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నేత



జనవరి 16... జైపాల్ రెడ్డి జయంతి

రాజకీయాల్లో ఆయనది ప్రత్యేక శైలి. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా.. ఐదుసార్లు ఎంపీగా.. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి, దశాబ్దాల రాజకీయ జీవితంలో మేధావిగా, సకల విషయ పరిజ్ఞానిగా, నిగర్విగా, నీతి, నిజాయితీ లకు మారు పేరుగా అవిభక్త ఆంధ్ర ప్రదేశ్, దేశ రాజకీయాల్లో తన ప్రత్యేకత చాటిన అనుభవ శాలి ఆయన. విధి ఆయనపై చిన్న చూపు చూసినా, అంగ వైకల్య మును జయించి, మానసిక స్థైర్యాన్ని వశం చేసుకుని, సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో కొనసాగిన అలుపెరగని యోధుడు ఆయన. భారత ప్రజల అభీష్టానికి వ్యతి రేకంగా విధించబడిన అత్యాయక స్థితి నిర్ణయాన్ని వ్యతిరేకించి, తామున్న పార్టీకి రాజీనామా చేసి, ఏకంగా పార్టీ అధినేత్రి ఇందిరా గాంధీనే ఎదిరించి ఆమెపై ఎంపీ స్థానానికి ఎన్నికల్లో పోటీకి నిలబడ్డ ధీశాలి ఆయన. ఆయనే రాష్ట్ర రాజకీయాలతో పాటు జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న తెలంగాణ గర్వించ దగిన మేధావి సూదిని జైపాల్ రెడ్డి.

సూదిని దుర్గారెడ్డి, యశోదమ్మ దంపతులకు జైపాల్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాడుగులలో 1942 జనవరి 16న జన్మించారు. 18 నెలల వయసులో ఉండగానే పోలియో కారణంగా వైకల్యానికి గురయినా, అది ఆయన రాజకీయ జీవన ఆరోహణకు ఎన్నడూ అవరోధం కాలేక పోయింది. మాడుగులతో పాటు నల్గొండ జిల్లా దేవరకొండలో ప్రాథమిక విద్యాభ్యాసం కొన సాగించారు. ఉస్మానియా నుండి ఎంఎ ఇంగ్లీష్ లిటరేచర్‌లో పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు.

జైపాల్ రెడ్డి నాలుగు సార్లు శాసన సభ్యునిగా, జనతా పార్టీ జనరల్ సెక్రెటరీగా, మహబూబ్‌నగర్ ఎంపీగా, మిర్యాలగూడ ఎంపీగా, రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా , రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా, పాలు మార్లు కేంద్ర మంత్రిగా, పని చేసిన విశేష అనుభవ శాలి. ఎమర్జెన్సీ ప్రకటనను వ్యతిరేకించడం, కాంగ్రెస్ హైకమాండ్‌కి ఆయన ఎదురు తిర గడం, ఇందిరా గాంధీ కి ఎంపీ స్థానా నికి పోటీ చేయడం ఆయన ప్రత్యేక తలు. చట్ట సభలలో చేసిన డిబేట్లు అత్యంత కీలకమైనవిగా ఉంటా యని ప్రశంసలు అందుకున్నారు. పార్టీలకు అతీతంగా నేతలతో చనువు పెంచుకున్న, ప్రేమను పంచుకున్న గొప్ప నాయకుడు జైపాల్ రెడ్డి.

నల్గొండ జిల్లా దేవరకొండలో ప్రాథమిక విద్యాభ్యాసం సాగించిన జైపాల్ రెడ్డి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎంఏ ఇంగ్లీష్ పట్టా తీసుకున్నారు. ఉస్మానియాలో విద్యార్థి నాయ కుడిగా ఉండగానే జైపాల్ రెడ్డి రాజకీయ జీవితం ప్రారంభం అయింది. కాంగ్రెస్ పార్టీలో చేరి, 1969లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. ఆ తర్వాత మరో మూడు సార్లు కూడా ఇదే నియోజక వర్గానికి ఆయన ఎమ్మెల్యేగా పనిచేశారు.

1975లో ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించ గా, దీన్ని వ్యతిరేకిస్తూ జైపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. జనతా పార్టీలో చేరి, 1980లో ఇందిరా గాంధీపై మెదక్ ఎంపీ స్థానంలో పోటీకి దిగారు. అయితే, ఆయనకు ఓటమి చవి చూశారు. 1984లో జైపాల్ రెడ్డికి పార్లమెంటు లో సభ్యుడిగా అడుగుపెట్టే అవకాశం తొలిసారి వచ్చింది. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఆయన గెలిచారు. 1985 నుంచి 1988 వరకు జైపాల్ రెడ్డి జనతా పార్టీ ప్రధాన కార్య దర్శిగా పనిచేశారు. ఆ తర్వాత విభేదాల వల్ల ఆయన జనతా దళ్‌లో చేరారు. 1990, 1996లో రాజ్యసభ ఎంపీగా ఎంపికయ్యారు. 1991 నుంచి 1992 వరకూ రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. 1998లో జనతా దళ్ (సెక్యులర్) తరఫున మహ బూబ్ నగర్ ఎంపీగా రెండో సారి ఎన్నికయ్యారు. అదే ఏడాది ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పురస్కారం కూడా ఆయన అందుకున్నారు. ఈ పురస్కారం అందుకున్న తొలి దక్షిణ భారత ఎంపీ ఆయనే. 1999లో జైపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్ లో చేరారు. వరుసగా 1999, 2004లలో ఆ పార్టీ తరఫున మిర్యాలగూడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఎన్నికయ్యారు. 1999 నుంచి 2000 వరకు సభాహక్కుల ఉల్లంఘన కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. జైపాల్ రెడ్డి పలుమార్లు కేంద్ర మంత్రిగానూ పనిచేశారు. ఇంద్ర కుమార్ గుజ్రాల్ నేతృత్వంలో ఏర్పడ్డ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో, ఆ తర్వాత మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభు త్వాల్లో జైపాల్ రెడ్డి కేంద్ర మంత్రి పదవులు చేపట్టారు. 2004లో యూపీఏ తొలి ప్రభుత్వ హయాం లో మిర్యాలగూడ నుంచీ గెలిచి, తిరిగి కేంద్ర మంత్రిగా పనిచేశారు జైపాల్ రెడ్డి. 2009లో యూపీఏ రెండో ప్రభుత్వ హయాంలో చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచీ ఎన్నికై... పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రిగా పని చేశారు. 2012-2014 మధ్య కాలంలో సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా కూడా చేశారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ, పట్టణాభివృద్ధి శాఖ, పెట్రోలి యం, సహజ వాయువుల శాఖ సహా మరికొన్ని శాఖలకు మంత్రిగా పని చేశారు. పని చేయడమే తప్ప ప్రతిఫలం ఆశించని నేతగా ముద్ర పడ్డ జైపాల్ రెడ్డికి పదవులు వెతుక్కుంటూ వచ్చాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన ప్రధాన అంతర్గత పాత్ర పోషించారు. తెలంగాణ నుండి కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా, సోనియా గాంధీకి విశ్వస నీయునిగా, ప్రత్యేక రాష్ట్ర సాధనలో బహిర్గతం కానీ ఆయన పాత్ర ఎన్నదగినది. రాష్ట్ర విభజన నివారణకై, ఆయనకు ముఖ్య మంత్రి పదవి ఇవ్వ జూపినా, ప్రజల ఆకాంక్షల దృష్ట్యా ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించారనే ప్రచారం ఉంది. జైపాల్ రెడ్డి హైదరాబాదు గచ్చి బౌలిలోని ఏషియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో చికిత్స పొందుతూ 2019, జూలై 28న మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

---

## భారత రాజకీయాల్లో యువత భాగస్వామ్యం తప్పనిసరి

**భారతదేశ జనాభాలో 15 నుండి 40 ఏళ్ల వయస్సున్న వారు 65 శాతం ప్రజలున్నారు. వీరిలో కొంతమంది ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఉంటే, కోటానుకోట్ల యువత అడ్డా కూలీలుగా, కర్మాగారాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. రాజకీయాలు ఇష్టముండి రాజకీయ నాయకుల వెంట యువత తిరిగినప్పటికీ వృద్ధ రాజకీయ నేతలు వారిని జీవితాంతం జెండాలు మోసేవారీగానే చూస్తున్నారు గానీ రాజకీయ నేతలుగా ఎదగనివ్వడం లేదు. మరొక 22 ఏళ్లలో వందేళ్ల భారత్ ప్రపంచంతో పోటీ పడాలంటే రాజకీయాల్లో యువత భాగస్వామ్యం తప్పనిసరి అవసరం.**



రాజకీయ నాయకులు తమ పిల్లలను మాత్రమే రాజకీయాల్లోకి దించి వారి కుటుంబ వారసత్వాన్ని చాటుకుంటున్నారు గానీ కొత్త ముఖాలున్న యువతను ఏ పార్టీలు ఆదరించడం లేదు లేదు. జ్యోతిరాదిత్య సింధియా, సుప్రియ సూలే, ఒమర్ అబ్దుల్లా, అఖిలేష్ యాదవ్, రాహుల్ గాంధీ, సచిన్ పైలెట్, ఉదయనిధి మారన్, కేటీ రామారావు, కవిత, జానారెడ్డి కుమారులు, మైనంపల్లి కుమారుడు, కడియం కూతురు ఇలా ఎందరెందరో రాజకీయ వారసత్వం కలిగిన వారే వుంటున్నారు గానీ రాజకీయ నేపథ్యం లేని కుటుంబాలకు చెందిన తెలివైన యువతను పార్టీలు గుర్తించడం లేదు. బాగా చదువుకుని, దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వ సంపద, ఆర్థిక భౌగోళిక, సామాజిక రంగంపై సమగ్రమైన అవగాహన ఉండి అంతర్జాతీయ స్థాయిలో భారత్ పేరు ప్రతిష్టలు ఇనుమడింప చేయాలనే తపన వున్న యువత ఐటీ రంగంలోనో, బిజినెస్ లోనో లేదా ఐఏఎస్. ఐపీఎస్ లాగా వుంటున్నారు గానీ, వీరిని ఆదరించి అక్కున చేర్చుకునే రాజకీయ నాయుకులు లేరు. భారత్ ప్రజాస్వామ్య దేశం. ఇక్కడి రాజ్యాంగంలో ప్రజా ప్రతినిధులకు మొదటి స్థానం వుంది కాబట్టి, ప్రజా ప్రతినిధుల ద్వారా మాత్రమే అంటే, అసెంబ్లీ, పార్లమెంట్ ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యం కాబట్టి తెలివైన యువతను ఎన్నుకుంటేనే మంచి జరుగుతుంది

అసోసియేషన్ అఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహించాలని చెప్పింది. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికలు జరిగే ప్రతిసారి తాము పోటీ చేస్తున్న స్థానాల్లో 20 శాతం మంది కొత్త యువతను ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా నిలబెట్టాలని ప్రతిపాదించింది. అయినా నేనే వుంటాను.. నేనే ఎదుగుతాను.. నేనే శాసిస్తాను అంటూ ఏళ్లకు ఏళ్లుగా వాళ్లకు వాళ్లే సీట్లు పంచుకుంటున్నారు గానీ యువతకు ప్రాధాన్యం దక్కడం లేదు. మరొకవైపు ఎన్నికల సమయంలో అప్పటికప్పుడు ఫారిన్ నుండి డబ్బుల సంచులతో వచ్చి సీట్లు దక్కించుకుని ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలైన హెలికాప్టర్ పొలిటీషియన్స్ ఎందరో వున్నారు. పార్టీ ఫండ్ బాగా ఇచ్చారు కాబట్టి వీరికి టికెట్లు ఇచ్చి గెలిపించుకుంటున్నారు లేదా అప్పటికప్పుడు పార్టీలు మారి వచ్చిన వారికి మరొక పార్టీ స్వాగతం పలికి టికెట్లు ఇచ్చి గెలిపించిన సంఘటనలు మనం చూస్తున్నాం అంతేగానీ, పార్టీని నమ్ముకుని కార్యకర్తలుగా పనిచేసే యువతకు స్వాగతం పలికే లీడర్లు లేరు. వాడు మన కులం కాదు, వాడు మన మతంకాదు వాడి దగ్గర డబ్బులు లేవు. వాడికీ ఎమ్మెల్యే అయ్యే అర్హత వుందా అంటూ ఎకసెక్కాలు పలికే వృద్ధ లీడర్లు రాజకీయాల నుండి తప్పుకోవడం మంచిది. రాజకీయ పార్టీలు కొత్త ఉత్పతులను తయారుచేసే ఒక కర్మాగారం లాగా ఉండాలనేది సామెత.

ప్రస్తుతమున్న ప్రజా ప్రతినిధుల్లో నూటికి తొంభై శాతం మంది అరవైకి పై బడినవారున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వీరికే పార్టీల టికెట్లు దక్కుతాయి. వీరే గెలుస్తుంటారు. వీరే ఓడిపోతుంటారు. రాత్రికి రాత్రి పార్టీలు మారుతుంటారు. కండువాలు మార్చుకుంటారు అయినా సరే.. పార్టీలు వీళ్ళనే నమ్ముతుంటాయి.. ఈ జాడ్యం పోవాలి. పార్టీలు మారిన వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకోవాలి. రాజకీయాలంటే ఆసక్తి వున్న యువతను బలపరిస్తే నూతన ఆశయాల సాధన కోసం వారు కృషి చేస్తారు. గత పదేళ్లుగా వున్న ఎమ్మెల్యేలను మళ్ళీ గెలిపించమని మూడోసారి కూడా వారికే టికెట్స్ ఇస్తే ప్రజలు కాళ్ళ వాతలు పెట్టి విసిరిపారేసిన సంఘటన మన కళ్ళముందే వుంది. ఈ లెక్కన ప్రతి రాజకీయ పార్టీ నూతన సభ్యులకు, యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి. వృద్ధ రాజకీయనేతలు ఇక చాలు అనుకుని బయట పడటం మంచిది. విద్యావంతులను గుర్తించి వారిలో నాయకత్వ లక్షణాలను కల్పించినపుడు ఉజ్వల భారత్ మరింత వేగంగా ముందుకు కదులుతుంది. రక్షణ రంగంలో యువతకు ప్రాధాన్యం ఇస్తున్నప్పుడు, దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా ఉండాలంటే యువతను రాజకీయాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

- కన్నోజు మనోహరా చారి

---

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

---

## నిజాయితీ, నిబద్ధతగల రాజకీయ నాయకుడు

# గుల్జారీలాల్ నందా



గుల్జారీలాల్ నందా పేరు ఈ తరం వారికి చాలా మంది తెలియకపోవచ్చు. అయన భారత దేశానికి రెండు సార్లు ఆపద్ధర్మ ప్రధాన మంత్రిగా భాద్యతలను చేపట్టారు. పదవిలో ఉన్న ప్రధాని ఆకస్మికంగా మరణిస్తే, లోకసభ సభ్యులు మరో నేతను ఎన్నుకుని ఆ పదవిలో సదరు నేత చేరే వరకు తాత్కాలికంగా ప్రధాని పదవిని రాజ్యాంగం ప్రకారం నిర్వహించే పదాధికారిని ఆపద్ధర్మ ప్రధాన మంత్రి అంటారు. అలా నందా మొదటి సారి 1964 లో భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ మరణం తరువాత13 రోజులు (27 మే 1964 – 9 జూన్ 1964); రెండవసారి 1966లో లాల్ బహదూర్ శాస్త్రి మరణం తరువాత (11 జనవరి 1966 – 24 జనవరి 1966) 13 రోజులు ఈ పదవిని చేపట్టారు. గుర్జారీలాల్ నందా నిబద్ధత కలిగిన జాతీయ రాజకీయ నాయకుడు, ఆర్థికవేత్త. కార్మిక సమస్యలపై ప్రత్యేకంగా కృషిచేసిన వ్యక్తి. రెండు పర్యాయములు భారతదేశ తాత్కాలిక ప్రధాన మంత్రిగా నెల రోజుల లోపే పదవిలో ఉన్నారు. రెండు సందర్భాలలోనూ లోకసభలో మెజారిటీ సభ్యులు కలిగి ఉన్న భారత జాతీయ కాంగ్రెస్, లోకసభ నాయకుడిని అంటే ప్రధాన మంత్రిగా కొత్త నేత ఎన్నిన్నుకునే వరకు ఈ రెండు సందర్భాలలో దేశ మలి రాష్ట్రపతి సర్వేపల్లి రాధా కృష్ణన్ చేత ప్రమాణ స్వీకారం చేయించ బడి, పరిపాలన బాధ్యతలు చేపట్టారు.

**1997లో అతనికి భారత రత్న పురస్కారం స్వీకరించారు.**

గుల్జారీలాల్ నందా 1898 జూలై 4న బ్రిటిష్ ఇండియాలో అవిభాజ్య పంజాబ్ ప్రాంతములోని సియాల్‌కోట్ (ప్రస్తుతము పంజాబ్ (పాకిస్తాన్)లో ఉన్నది) పంజాబీ హిందూ కుటుంబంలో జన్మించారు. లాహోర్, అమృత్‌సర్, ఆగ్రా, అలహాబాద్ లలో విద్యాభ్యాసం చేసారు. ఆయన1920-1921 వరకు ఈయన అలహాబాద్ విశ్వవిద్యాలయములో కార్మిక సమస్యలపై పరిశోధన చేశారు. 1921 లో బొంబాయిలోని నేషనల్ కాలేజీలో ఆచార్య పదవిని పొందారు. అదే సంవత్సరము బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమములో పాల్గొన్నారు. 1922లో అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ కార్మిక సంఘము కార్యదర్శిగా చేరి 1946 వరకు అందులోనే కొనసాగారు. 1932లో సత్యాగ్రహము చేసి జైలు కెళ్లారు. మరలా 1942 నుండి 1944 వరకు జైలులో గడిపారు. రిజిస్టరు కాబడిన "అలహాబాదు విశ్వ విద్యాలయ పూర్వ విద్యార్థుల అసోసియేషన్" విడుదలచేసిన 42 సభ్యుల జాబితాలో "గర్వపడ వలసిన పూర్వ విద్యార్థి" గా గౌరవింప బడ్డారు. 1937లో బ్రిటిష్ ప్రభుత్వంలో బొంబాయి శాసనసభకు ఎన్నికైనారు. తరువాత 1937 నుండి 1939 వరకు బొంబాయి ప్రభుత్వంలో పార్లమెంటు సెక్రటరీ గా (కార్మిక, ఎక్సైజ్ శాఖలు) సేవలనందించారు. 1946 నుండి 1950 వరకు బొంబాయి ప్రభుత్వంలో కార్మిక మంత్రిగా ఉన్నప్పుడు అతను రాష్ట్ర శాసనసభలో కార్మిక వివాదాల బిల్లును ప్రవేశపెట్టడంలో విజయవంతంగా నాయకత్వం వహించారు. కస్తూర్బా మెమోరియల్ ట్రస్టు లో ఒక ట్రస్టీగా తన సేవలను అందించారు. హిందూస్థాన్ మజదూర్ సేవక్ సంఘ్ కు సెక్రటరీగా, బొంబాయి హౌసింగ్ బోర్డు కు చైర్మన్ గా పని చేశారు. జాతీయ ప్లానింగ్ కమిటీలో సభ్యుడుగా ఉన్నారు. "ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్" ను నిర్వహించడంలో ముఖ్యపాత్ర వహించి, తరువాత ఆ సంస్థకు అధ్యక్షునిగా భాద్యతలు చేపట్టారు. 1947లో నందా జెనీవా, స్విడ్జర్లాండ్ దేశాలలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సభలకు ప్రభుత్వ ప్రతినిధిగా హాజరయ్యారు. ఆ సమావేశంలో "ఫ్రీడం ఆఫ్ అసోసియేషన్ కమిటి"లో పనిచేస్తూ, స్వీడన్, ఫ్రాన్స్, స్విడ్జర్లాండ్, బెల్జియం, యు.కె దేశాలను సందర్శించి ఆ దేశాలలో గల కార్మికులు, వారి గృహ పరిస్థితులను అధ్యయనం చేసారు.

మార్చి 1950లో భారత ప్లానింగ్ కమీషన్ లో వైస్ చైర్మన్ గా చేరారు. 1951 సెప్టెంబరులో అతను భారత ప్రభుత్వంలో ప్లానింగ్ మంత్రిగా నియమింప బడ్డారు. ఆయనకు వ్యవసాయం, విద్యుత్ శాఖలను కూడా అదనంగా కేటాయించారు. 1952 సార్వత్రిక ఎన్నికలలో బొంబాయి నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తిరిగి ప్లానింగ్, వ్యవసాయం, విద్యుత్ శాఖలకు మంత్రిగా నియమితుడయ్యారు. 1955 లో సింగపూర్ లో జరిగిన ప్లాన్ కన్సల్టేటివ్ కమిటీకి భారతీయ ప్రతినిధులకు నాయకత్వం వహించారు. నందా 1957 ఎన్నికలలో లోక్‌సభకు ఎన్నిక అయి కార్మిక, ఉపాధి, ప్లానింగ్ శాఖలకు కేంద్రమంత్రిగా పనిచేసారు. 1959 లోజెనీవా జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశాలలో పాల్గొన్నారు. తరువాత ప్లానింగ్ కమీషన్ డిప్యూటీ చైర్మంగా భాద్యతలు చేపట్టారు. 1959లో ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ, యుగోస్లేవియా, ఆస్ట్రియా దేశాలకు పర్యటించారు. నందా 1962 ఎన్నికలలో లోక్‌సభకు గుజరాత్ లోని శంబర్ కాంత నియోజకవర్గం నుండి తిరిగి ఎన్నికయ్యారు. సామ్యవాద నిర్మాణం కోసం కాంగ్రెస్ ఫోరం ప్రారంభించారు.1962 – 1963 కాలంలో కార్మిక, ఉపాధి శాఖలకు కేంద్రమంత్రిగాను, 1963 – 1966 కాలంలో హోం మంత్రిగానూ పదవులను చేపట్టారు. 1967,1971 లోక్‌సభ ఎన్నికలలో హర్యానాలోని కైతల్ నియోజవవర్గం నుండి ఎన్నికైనారు. 1970 – 1971 కాలంలో రైల్వే శాఖకు కేంద్రమంత్రిగా సేవలనందించారు. గుల్జారిలాల్ నందా రెండు సార్లు ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో చైనాతో, పాకిస్తాన్ తో యుద్ధం జరిగిన కీలకమైన సమయంలో సమయోచితంగా పదవి నిర్వహించారు. నందా 1998 జనవరి 15న తన 99వ యేట మరణించారు.

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు

- టీటీడీ కల్యాణ మండపంలో సామూహిక నోములు
- పంచ కల్యాణాలు, బృందావనం, గాజుల బండి నోములు



**విశ్వంభర, పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేట పట్టణంలో మకర సంక్రమణ మహోత్సవాన్ని పురస్కరించుకొని సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెద్దశంకరంపేటలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో ఆర్య వైశ్య మహిళలు పంచ కళ్యాణాలు, బృందావనం, గాజుల బండి నోముల కార్యక్రమం సామూహికంగా నిర్వహించారు. మహిళలు సీతారాములు, శివ పార్వతులు, రుక్మిణీ కృష్ణుడు, గణేస్ సిద్ధి, లక్ష్మి నారాయణ విగ్రహాలకు వేద బ్రాహ్మణ పండితుల మంత్రోశ్యరణలతో సామూహికంగా కళ్యాణాలు నిర్వహించి సామూహికంగా నోములు నోముకున్నారు. బెల్లం ముద్దలు, శనగపప్పు పాలటుకులు, రవ్వ, బస్మం, పెరుగు అటుకులు, కొబ్బరి పొడి, బెల్లం పొడి, తదితర వస్తువులతో సామూహికంగా నోములు నోముకొని ముత్తయిదులకు నోములు ఇచ్చిపుచ్చుకున్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో మహిళలు ఇళ్ల వాకిళ్లలో అందంగా అలంకరించి పలు రకాల రంగులతో ముగ్గులు వేసుకున్నారు. గొబ్బెమ్మలు, చెరకుగడలు, రేపల్లును వాకిళ్లలో ఉంచి పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కేరింతలు కొడుతూ గాలిపటాలు ఎగిరవేశారు. గృహాలలో చిన్నారులకు బోడపల్లు పోసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కె.లక్ష్మి, మహిళా ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాగం అర్చన, చకిలం విశాల, తదితరులున్నారు.

## ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బి.ఆర్.ఎస్ నాయకులు



**విశ్వాంభర, నాగారం:** తెలంగాణా రాష్ట్ర మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డికి నాగారం మండలం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో పుష్పగుచ్చం అందజేసి శాలువాతో శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఉన్నతమైన పదవుల తో సుఖశాంతుల తో జీవించాలని జగదీశ్వర్ రెడ్డి నిత్యం ప్రజా సేవకుడు తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు, గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు కెసిఆర్ గారి సహకారంతో ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కనివిని ఎరుగని రీతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, నిత్యం ప్రజల అభ్యున్నదయ కొరకు పాటుపడే ప్రజా సేవకుడు అని కొనియాడారు. ఈకార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు గుండగాని అంబయ్య, దోమల బాలమల్లు, తరాల ఆంజనేయులు , వెంకన్న , యాదగిరి, బీఆర్ఎస్ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామగిరి గ్రామస్తుల ఔదార్యం

*** రావిరాల వరద బాధితులకు దుప్పట్లు వితరణ**



**విశ్వంభర, నెల్లికుదురు:** మండలంలోని రావిరాల గ్రామానికి చెందిన 150 మంది వరద బాధితులకు శ్రీరామగిరి గ్రామస్తులు సంక్రాంతి పురస్కరించుకొని మంగళవారం దుప్పట్లు వితరణ చేశారు. మాజీ పట్వారి జనార్ధన రావు మనవడు శ్రీనాథ్ కుమారుడు శ్రీకేతన్ సైతం అమెరికాలో ఉంటూ శ్రీరామగిరికి చెందిన 15 మందితో కలిసి తన వంతు విరాళమందించాడు. గతంలోనూ ఇదే గ్రామానికి చెందిన ఉషాకర్ నిర్మాణ సంస్థ సహకారంతో 350 మందికి నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రజా వైద్యులు అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత డా.ఆదూరి కళాధర్ రాజు,వివేకానంద సాంస్కృతిక సమితి అధ్యక్షులు అభ్యుదయ కవి బొమ్మిడి వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరింత సహాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు జి నరేష్, రాములు, డీ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశికళ ఆనంద్



**విశ్వంభర, పరిగి:** పరిగి మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో మంగళవారం గ్రామ క్రికెట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ను పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశికళ ఆనంద్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శశికళ ఆనంద్ మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలని, క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. నేటి జీవితంలో ఏదో ఒక క్రీడపై ఆసక్తిని పెంపొందించుకున్నట్లయితే రోగాలు దరిచేరవని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీపై పోలీస్ అవగాహన




**విశ్వంభర, నాగారం:** జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు పురస్కరించుకుని సూర్యపేట జిల్లా ఎస్పీ , ఆదేశాల మేరకు నాగారం మండల కేంద్రం సూర్యాపేట జనగామ జాతీయ రహదారి 365 బీ పై ఎస్ఐ ఐలయ్య ఆధ్వర్యంలో మంగళవారం వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారులకు సూచనలిస్తూ భద్రత ప్రతి వ్యక్తి బాధ్యత అన్నారు. హెల్మెట్ , లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. మద్యం తాగి డ్రైవ్ చేయొద్దని, సెల్ఫోన్ వాడొద్దని, సీట్ బెల్ట్ ధరించాలని, వేగంగా నడపొద్దని, రోడ్ల పైన వాహనాలను నిలుపొద్దని చెప్పారు. వాహదారులు ,వాహన పత్రాలను లైసెన్స్ ను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

**విశ్వంభర, జనగామ:** సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినవారిని దేవరుప్పుల పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ది కృష్ణమూర్తి మాట్లాడుతూ మీరు ప్రభుత్వం ఉద్యోగంలో ఉన్న స్థాయిలో సేవలు అందించాలని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు ఎరుకల క్రాంతి, కారుపోతుల నరేష్, ఎండి ఖాజ, తోటకూరి మమత, చిలుకూరి సుకన్య, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## 'మన ఊరు మన ఎమ్మెల్యే' కార్యక్రమ పోస్టర్స్ ఆవిష్కరణ



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గం లోని ఎమ్మెల్యే బీ ఎల్ ఆర్ బ్రదర్స్ బుధవారం రోజున వేములపల్లి మండలం అమనగళ్ళు శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవాలయం నందు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) నిర్వహిస్తున్న 'మన ఊరు మన ఎమ్మెల్యే' నూతన కార్యక్రమ పోస్టర్స్ డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్ కాంగ్రెస్ నాయకులు మరియు బీఎల్ఆర్ బ్రదర్స్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీలతో పాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తన సొంత నిధులు వెచ్చించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. తన తల్లి మరణంతో ఆగిపోయిన 'ఈశ్వర్ బంధం' కార్యక్రమాన్ని మహా శివ రాత్రి పర్వదినం నుండి తిరిగి మొదలు పెడతానని ప్రకటించారు. గ్రామాలలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తే సహించేది లేదన్నారు. ప్రతి కార్యకర్త నాయకులు పార్టీ కోసం ఐక్యమత్యంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ 13 నెలల కాలంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పరిస్థితులను తాను అవగాహన చేసుకున్నానన్నారు. ఆయా గ్రామంలోని నాయకులు పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి కోసంచేపట్టాల్సిన పనుల వివరాలను తయారు చేయాలన్నారు. అభివృద్ధిలో రాష్ట్రానికే మిర్యాలగూడను దిక్సూచిగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తనతో కలిసి పని చేయాలని కోరారు. సంపాదన కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, పది కాలాలపాటు గుర్తుండిపోయే అభివృద్ధి పనులు చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీ ఎల్ అర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం కంసాన్ పల్లి గిరాయి గుట్ట లో శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమం జరిగింది. లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ సంక్రాంతి పండుగ శుభ సందర్భంగా సుఖ సంతోషాలతో, ఆనందోత్సవాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో, రైతన్నలందరూ పంటల సమృద్ధితో ఆర్థిక అభివృద్ధిలో ఎదుగుదల ఉండి సమాజంలో ఉన్నత స్థాయికి రావాలని, భగవంతుడు సన్నిధిలో ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫరుక్ నగర్ మండలం బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ వీరేశం గుప్తా, బీమారం మాజీ సర్పంచ్ రాములు నాయక్, ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రాజేష్ కంసాన్ పల్లి మాజీ ఉప సర్పంచ్ కె.యాదయ్య గౌడ్ బీఆర్ఎస్ నాయకులు తోట్ల బాలరాజ్ , కాకరజాలమల్లేష్, బి.శివ, జి.రామకృష్ణారెడ్డి,జి. వెంకటయ్య, యాదవ్ పల్లె, దశరథ్, అల్లి నరేష్, మోహన్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లను ప్రారంభించిన మురళీ కృష్ణ యాదవ్



**విశ్వంభర, కేశంపేట:** క్రీడల పోటీలు మానవునికి సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు మనిషిలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం కేశంపేట మండలం కోనాయిపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ , వాలీబాల్ టోర్నమెంట్లను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. క్రీడలు ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించడంతోపాటు గ్రామాల మధ్య, ప్రాంతాల మధ్య ఐక్యతను చాటుతాయని చెప్పారు. మారుమూల పల్లెల్లో సైతం పెద్ద ఎత్తున క్రీడల పోటీలను నిర్వహించడం ఆదర్శనీయమని కొనియాడారు. సంక్రాంతి పర్వదినం వేల అన్ని వర్గాల ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని, నేటితరం యువత ఆదర్శంగా ఎదగాలని, వారు అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని కోరారు. క్రీడ పోటీలలో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి, పోటీల నిర్వాహకులకు పేరుపేరునా అభినందనలు తెలుపుతున్నానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, పీఏసీయస్ ఛైర్మన్ జగదీశ్వర్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచులు యాదగిరి రావు, వెంకట్ రెడ్డి, వెంకటయ్య, శ్రీశైలం, నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్ నాయకులు జమాల్ ఖాన్, జగన్మోహన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, రామకృష్ణ, రాము, హనుమంతు నాయక్, మురళీ, వెంకటేష్, నరేందర్, అసిఫ్, విజయ్, శ్రీకాంత్ తదితరులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ కాల్వకు మళ్లీ గండి



**విశ్వంభర,ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారం శివారు మీట్యా తండా సమీపంలోని మర్రికుంట తండా దగ్గర శ్రీరాంసాగర్ ప్రాజెక్టు చెందిన డీబీఎం 48 కెనాల్ కు చెందిన 10 ఆర్ 1 కాలువ కు గతంలో తెగిన పక్కనే మంగళవారం మళ్లీ గండి పడింది. గమనించిన రైతులు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో నీరు రాకుండా ఆపి చేశారు. గండి పడటంతో వేసంగి సాగు కోసం రైతులు రమ స్సింగ్, మాన్సింగ్ ఇటీవలే వేసిన వరి నాటు కొట్టుకుపోయింది.దీంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. మకర సంక్రాంతి పర్వదినం కావడంతో రైతులు సంతోషంగా కుటుంబాలతో గ డుదామనుకుంటే కాలువ తెగిపోవడంతో ఆందోళనకు గురయ్యారు.మధ్యాహ్నం సమయంలో కాలువ తెగడంతో రైతులు గుర్తించారు. అదే రాత్రి సమయంలో అయితే భారీగా నష్టం జరిగేదని ఆవేదన వ్యక్తం చేశారు. కా గా గత 4 మాసాల క్రితం వర్షాలకు గండిపడిన పక్కనే ప్రస్తుతం కాలువ తెగిపోగా ఇటీవలే మట్టితో పూడ్చి మరమ్మతు చేశారు. ఇంకా దానికి సిమెంట్ పనిచేయలేదు. వెంటనే గండిని పూడ్చి మరమ్మతులు పూర్తిస్థాయిలో చేసి వేసంగి పంటలకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

## ఐద్వా,డీవైఎఫ్ఐ,పీఎన్ఎం ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో ఐద్వా, డీవైఎఫ్ఐ, పీఎన్ఎం రామన్నపేట పట్టణం కమిటీ ల ఆధ్వర్యంలో జూనియర్ కాలేజి గ్రౌండ్ లో నిర్వహించిన భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ ఎస్సై మౌనిక, రైతు సంఘం జిల్లా నాయకులు మేక అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సాల్వేర్ అశోక్, మాజీ ఎంపీటీసీ రెహాన్, వార్డు సభ్యులు గొలుసుల ప్రసాద్, సీపీఎం పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన మండల అధ్యక్షుడు

**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బీజేపీ అధ్యక్షులు వెన్నమనేని శ్రీధర్ రావు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో బీజేపీని బలోపేతం చేయడానికి మరింతగా కృషి చేస్తూ కార్యకర్తలును నాయకులను ఏకధాటిపై తీసుకువచ్చి గెలుపేలక్ష్యంగా కృషి చేస్తూ రాబోయే స్థానిక సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ మెజార్టీ స్థానాలు గెలుచుకోవడానికి మండలంలో నాయకులను కార్యకర్తలు అందరిని కలుపుకొని పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని, అధిష్టానం నాపై నమ్మకం ఉంచి రెండోసారి తంగళ్ళపల్లి మండల బీజేపీ అధ్యక్షునిగా నియమించినందుకు కేంద్రమంత్రి సంజయ్ కి ఉమ్మడి జిల్లా అధ్యక్షులకు జిల్లా అధ్యక్షులకు నాకు అధ్యక్ష పదవి రావడానికి కృషి చేసిన బీజేపీ నాయకులకు కార్యకర్తలు కు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా తెలియజేశారు.

## క్రికెట్ ప్రీమియర్ లీగ్ విన్నర్‌గా అయూబ్ 11 టీం



**విశ్వంభర, పరిగి:** పరిగి మండల పరిధిలోని కుదవంద్పూర్ గ్రామంలో కీర్తిశేషులు సుంకరి కృష్ణ జ్ఞాపకార్థం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. అయూబ్ 11 టీం మొదటి స్థానంలో నిలవగా,శ్రీనివాస్ 11 టీం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పరిగి మండల మైనార్టీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అయూబ్, మండల బీజేపీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని, క్రికెట్ టోర్నమెంట్ తో గ్రామంలోని ప్రజల్లో ఐక్యమత్యం పెంపొందుతుందన్నారు. క్రీడల వల్ల శారీరక మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, క్రీడాకారులు సద్దాం, నరేష్, హుస్సేన్, ఫెరోజ్, పవన్ కుమార్ రెడ్డి, కృష్ణయ్య, యాదయ్య, శివ, శ్రీశైలం, మహేష్ కుమార్, రఫీ, నరేష్, మల్లేష్, వంశీ, ఫయాజ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

### సంక్రాంతి ముగ్గుల పోటీలో

## విజేతలకు బహుమతులను ప్రదానం



**విశ్వంభర, దేవరుప్పుల:** జనగాం జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ దగ్గర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి, మరియు కనుమ పండుగల సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ పాల్గొని ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు పంపిణీ చేసిన ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల యూత్ అధ్యక్షులు పులిగిల్ల వెంకన్న ,గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పుల ఉప్పులయ్య,జిల్లా నాయకులు కాసారపు ధర్మ రెడ్డి ,మండల నాయకులు, బోనగిరి యాకస్వామి,రెడ్డి రాజులు రమేష్,తోటకూరి వెంకన్న,ఆకుల సోమ నర్సయ్య యూత్ నాయకులు,గ్రామ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మా సేవలపై, మీ అభిప్రాయాలు తెలపండి

*** ఎస్సై రమేష్ బాబు**



**విశ్వంభర, నెల్లికుదురు:** రాష్ట్రవ్యాప్తంగా డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు పోలీసుల సేవలపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మండల ప్రజలు తమ అభిప్రాయాలను తెలుపాలని ఎస్ఐ చిర్ర రమేష్ బాబు సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రామ్ నాథ్ కేకన్ ఈ మేరకు ఇటీవల క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లింక్ (https://qr.meqr.com/aZMTxHDm) ఆవిష్కరించారు. ఇందులో సూచించిన విధంగా ఎఫ్ ఐ ఆర్, ఈ చాలాన్(ట్రాఫిక్ ఉల్లంఘనలు), పాస్ పోర్ట్ ధ్రువీకరణ, ఇతర అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలుపాలని చెప్పారు. మీ అభిప్రాయాలు మాకెంతో విలువైనవన్నారు.

# ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించాలి

## ○ కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

విశ్వంభర, మహబూబాబాద్: ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు, తహసిల్దార్లు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్స్, సంబంధిత అధికారులతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, తదితర అంశాలపై అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కే. వీర బ్రహ్మచారి లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడానికి జిల్లా యంత్రాంగం, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దారులు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ విస్తరణ అధికారులు, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం అందే విధంగా కృషి చేస్తూ విధులు నిర్వహించాలని సూచించారు.

అందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాల చేత సర్వే నిర్వహించడం జరిగిందన్నారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని అందుకోసం ప్రత్యేకంగా అన్ని విభాగాలతో కలిపి ఒక



బృందంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, కృష్ణవేణి, డీసీఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో పురుషోత్తం, డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సీపీఓ సుబ్బారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, డీఏవో విజయనిర్మల, డీవీహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డీపీఓ హరిప్రసాద్, గ్రౌండ్ వాటర్ డీడీ సురేష్, డీ హెచ్ ఓ మరియన్న, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## విస్తృతంగా వాహనాల తనిఖీలు

### రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

**విశ్వంభర, సూర్యాపేట:** కారు నడిపేటపుడు డ్రైవర్లు తప్పక సీటు బెల్టు ధరించాలనీ సూర్యాపేట పట్టణ ఎస్ఐ సాయిరాం సూచించారు. మంగళవారం సూర్యాపేటలోని ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద రోడ్డు భద్రత మసోత్సవల్లో భాగంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. కారు డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండటమే కాకుండా సంబంధిత పత్రాలను ఎల్లవేళలా కలిగి ఉండాలనీ తెలిపారు. అతి వేగంతో నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి ప్రాణానికి ముప్పు తెచ్చుకోవద్దని హితవు పలికారు. సురక్షిత ప్రయాణానికి ప్రభుత్వం నిత్యం అనేక సూచనలు చేస్తుందనీ, వాటిని విధిగా ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక

### * కండువా కప్పి పార్టీలో ఆహ్వానించిన దశరథ్ నాయక్



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సరియాతో పాటు బూత్ కమిటీ అధ్యక్షుడు వినోద్ హిరా నాయక్, కిరణ్ లతోపాటు దాదాపు 10 మంది బీజేపీ నాయకులు పార్టీ లో చేరారు. వారిని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ పార్టీలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో లేకున్నా బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు విశ్వాసం నమ్మకం ఉందని అందుకే బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏదో చూపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు తులసి రామ్ నాయక్, శ్వేతా భూనాథ్, డైరెక్టర్ సేవ్య నాయక్ మాజీ ఉపసర్పంచ్ శారదా పాండు, రమణ నాయకులు రమేష్ శ్రీను సోమ్లా దశరథ్, పత్తి శ్రీను, దేవా, రాజు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చురుగ్గా పనిచేయాలి

### - ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండల కేంద్రంలోని మండల్ ఆఫీస్ మీటింగ్ హాల్లో జరిగినటువంటి సమావేశంలో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ సుధారాణి మాట్లాడుతూ ఏడీఏ అగ్రికల్చర్ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్లకు, పంచాయతీ కార్యదర్శులకు, ఏపీఓ, టీఏలు, ఈసీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఐకేపీ సీసీలకు రేపటినుండి అనగా 16వ నుండి 20 వరకు జరగబోయే ఫీల్డ్ సర్వే కి సంబంధించిన సూచనలు ఇవ్వడం జరిగింది. ఎంపీడీవో సరిత,ఎమ్మార్వో గోపాల్, ఎంపీ ఓ గీత పాల్గొన్నారు. 16 నుండి 20 వరకు ఫీల్డ్ సర్వే చేయాలని, 21 నుండి 25 వరకు గ్రామ సభలు పెట్టి అర్హుల జాబితా డిస్ప్లే చేసి అర్హులను ఎంపిక చేయాలని 26వ తేదీన అఫీషియల్ గా ప్రోగ్రాం లాంచ్ చేయబడుతుందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వివిధ గ్రామాల సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ఎన్ జీ ఎఫ్

### * సలీమ ఆపరేషన్ కు రూ.1 లక్ష అందజేత



**విశ్వంభర, నెల్లికుదురు:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపెల్లి లో 10 సం.ల క్రితం ఉన్న ఊరు కన్నతల్లి కాన్సెప్ట్ చిర్ర యాకాంతం గౌడ్ అధ్యక్షతన ఏర్పడి 32 మంది సభ్యులతో కొనసాగుతోంది. ఆపదలో ఉన్న ఎంతో మందికి చేయూతనందిస్తోంది.ఈ క్రమంలో లివర్ పాడైన అదే గ్రామానికి చెందిన ఎండి సలీమాకు లివర్ ట్రాన్స్ఫర్మేషన్ ఆపరేషన్ కు ఎంజీఎఫ్ సభ్యులు సొంతంగా బుధవారం రూ.1 లక్ష సహాయం అందజేసి తన దాతృత్వం చాటుకున్నారు.ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు యాకాంతం గౌడ్ మాట్లాడుతూ.. సలీమ ఆపరేషన్ కు రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు సూచించడంతో ఆ పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు.తోచిన విధంగా ఆర్థిక సహకారమందిద్దామని దాతలకు ఆయన వినమ్రతాపూర్వక పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎన్ జీ ఎఫ్ ప్రతినిధులు మహిపాల్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాసాచారి, దిలీప్ కుమార్, చిర్ర వెంకట్, ప్రవీణ్ కుమార్,చందు,బొల్లు అశోక్ కుమార్,పెరుమాండ్ల సుమన్,అజయ్,అజీమ్, ఉమేష్,శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగృహము నందు సాంప్రదాయ బద్ధంగా ముగ్గులు వేసి వేడుకలు జరుపుకున్న వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు.
(విశ్వంభర, కూకట్ పల్లి)

## సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

### * బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**విశ్వంభర, జనగాం:** దేవరుప్పుల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలలో హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి,మరియు కనుమ పండుగల సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతి రూ. 5000 లు రూపాయలు, ద్వితీయ బహుమతి రూ. 3000 లు, తృతీయ బహుమతి రూ. 2000 లు ఈ ముగ్గుల పోటీని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు మన సాంస్కృతిని ఆచారాన్ని మన ముందు తరానికి తెలియచేయాలన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల అధ్యక్షులు నల్ల శ్రీరాములు మండలం,యూత్ అధ్యక్షులు పులిగిళ్ల వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పుల ఉప్పులయ్య, జిల్లా నాయకులు కాసారపు ధర్మ రెడ్డి , తోటకూరి పాండు కృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్య సర్జన్ నాయక్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు మమ్మహాద్ గులాం రసూల్ , మాజీ ఎంపీటీసీ మహమ్మద్ జాకీర్ హుస్సేన్, మండల నాయకులు, ఓడపల్లి రవి,బోనగిరి యాకస్వామి, పారుపెల్లి శ్రీనువాస్ , సీత మల్లయ్య, తీగల వెంకన్న,రెడ్డి రాజులు రమేష్, లొడంగి అశోక్, కొంగరి ఉమేష్ ,తోటకూరి వెంకన్న,ఆకుల సోమ నర్సయ్య,యూత్ నాయకులు, వివిధ గ్రామ గ్రామాల పార్టీ అధ్యక్షులు మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెద్దగట్టు జాతరకు నూతన కమిటీ నిద్రాహారాలు మాని పనిచేయాలి

### * పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ సెక్రటరీ కొప్పుల వేణారెడ్డి



**విశ్వంభర, సూర్యాపేట:** పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు నిద్రాహారాలు మాని నూతన కమిటీ కష్టించి పనిచేయాలని పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ సెక్రటరీ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో దురాజ్ పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి దేవస్థానం కు నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా కొప్పుల వేణారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీని శాల్వాతో సత్కరించి పూల బుక్కెను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.తెలంగాణలోనే రెండోవ అతిపెద్ద దురాజ్ పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఫిబ్రవరి 16న ప్రారంభమై 20 వరకు జాతర జరగనుందని,ఈ ఆలయ ట్రస్ట్ బోర్డు కమిటీని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్ని విధాలుగా అలోచించి పెద్ద గట్టు లింగమంతుల స్వామి దేవాలయం కమిటీ ఛైర్మన్ గా పోలేబోయిన నర్సయ్య యాదవ్, కమిటీ సభ్యులు కుర్ర సైదులు, వీరబోయిన సైదులు, సిరిపంగి సైదమ్మ, మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్న మల్లయ్య, పోలేబోయిన నరేష్ పిల్లే లను నియమించడం జరిగిందన్నారు. ఈ కమిటీ ద్వారా సూర్యాపేట ప్రాంతంలో ప్రశాంతంగా ఈ జాతరను విజయవంతం చేయాలి తెలిపారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ జాతరకు లింగమంతుల స్వామిని దర్శించుకోవడం కొరకు లక్షలాది మంది భక్తులు వస్తారని వారికీ అన్ని రకాల ఏర్పాట్లు ఈ కమిటీ చేయాలనే తపనతోటి దామోదర్ రెడ్డి ఈ కమిటీ నియమించారని అన్నారు. గత జాతరకు ఐదు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినట్టు సమాచారం ఉందని ఆ విషయాన్నీ పెద్దలు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రాంరెడ్డి దామోదర్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి నాయకత్వంలో ఈ కమిటీ ద్వారా కలిసి ఈ జాతర కు ఎక్కువ నిధులు తీసుకోచ్చే విధంగా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ తరుపున తెలిపారు.

## పల్లె పల్లెల్లో ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు

**విశ్వంభర, ఆమనగల్లు:** కల్వకుర్తి నియోజకవర్గం లోని మండల కేంద్రాలు, గ్రామ గ్రామాల్లో మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆమనగల్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ ఐక్యవేదిక యూత్ అధ్యక్షులు నాగిళ్ల జగన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అధ్యక్షులు పత్య నాయక్ చుక్కనిరంజన్ గౌడ్ తో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, తలకొండపల్లి మాజీ సర్పంచ్ జ్యోతయ్య, మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి నరసింహ, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంకర్, ఇమ్రాన్, కటికల శేఖర్, ప్రసాద్, శివకుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## సంక్రాంతి సంబరాలు



**విశ్వంభర, మహబూబాబాద్:** అక్క చెల్లెలు ఇద్దరు బీటెక్ చదువుతున్నారు. శివాని బీటెక్ థర్డ్ ఇయర్, భవాని బీటెక్ మొదటి సంవత్సరం చదువులలో ముందంజలో ఉంటూ చక్కటి విద్యలో ప్రతిభను చూపిస్తూ సంక్రాంతికి తన స్వగృహానికి వచ్చినప్పుడు ఇంటి ముందు ముగ్గులు వేయడం ఆనవాయితీ రకరకాల ముగ్గులు వేశారు. గతంలో తెలంగాణ న్యూస్ పేపర్ నిర్వహించిన ముగ్గులలో పోటీలలో చక్కటి ప్రతిభ కనబరిచి బహుమతి గెలుపొందారు. దీనికి వారి అమ్మానాన్నల ప్రేరణ ఎంతో ఉంది ఆడపిల్లలు కచ్చితంగా అన్ని పనులు వచ్చి తీరాలి అని వారి అమ్మానాన్నల కోరికలు నెరవేర్చాలని ఇది ఆడపిల్లల సంప్రదాయం అని కాలనీవాసులు కొనియాడారు.

## అర్హులను గుర్తించండి

### * మున్సిపాలిటీ కమిషనర్ వసంత

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో జిల్లా కలెక్టరేట్ ఆదేశానుసారం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల అర్హులను గుర్తించడానికి కమిషనర్ వసంత సమావేశం నిర్వహించారు. బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో వార్డు అధికారులు, సర్వేయర్లు, మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు అర్హత కలవారిని గుర్తించాలని వార్డు అధికారుల కు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్మన్ రాంపాల్, వైస్ ఛైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ నెంబర్లు, మున్సిపాలిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## వాలీబాల్ పోటీల్లో బహుమతులు అందజేత



**విశ్వంభర, ఆమనగల్లు:** యువజన దినోత్సవం సందర్భంగా గత మూడు రోజుల నుంచి ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్ పల్లి తండాలో వాలీబాల్ సీజన్ 2 పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 8 టీం లో పోటీపడి విజేతలుగా చంద్రాయన్పల్లి తండా సీపీటీ ఈగల్స్ మొదటి బహుమతి 10 వేల రూపాయలు, హనుమాన్ సేన రెండవ బహుమతి 6వేలు, సోనుసోద్ యూత్ ఫోర్స్ చంద్రన్నపల్లి చిన్న తండా మూడో బహుమతి 3 వేలు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పెద్దలు, స్పాన్సర్స్ కు పాపిశెట్టి రాము, రాగ్య నాయక్, గోపాల్ నాయక్ సీతారాం నాయక్ అమృనాయక్, గణేష్ నాయక్ తులసి రామ్ నాయక్, కళ్యాణ్ నాయక్, మున్సిపాలిటీ పెద్దలు శ్రీధర్ నాయక్, హర్యానాయక్, లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సంస్కృతి, సంప్రదాయాలను యువత కాపాడాలి

### * శెట్టి వెంకన్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమాండ్లసంకీస గ్రామ శాఖ సంక్రాంతి ముగ్గుల పోటీ లను ముఖ్యఅతిధిగా విచ్చేసిన రైతుసంగం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న మంగళవారం ప్రారంభించారు. అనంతరం విజేతల బహుమతి ప్రదానోత్సవ సభలో వెంకన్న మాట్లాడుతూ కుల మత రహిత సంస్కృతి సాంప్రదాయలలో యువతి యువకులు ముందుండాలి అని కోరారు. నాడున్న సమాజంలో యువత చెడుమార్గాలకు లోనుకాకుండా మహిళలకు అండగావుంటూ గ్రామాభివృద్ధికి సహకరించాలని విజ్ఞాప్తి చేశారు. గ్రామంలో పెద్దసంఖ్యలో పాల్గొన్న యువతి యువకులకు గ్రామ ప్రజలకు సంక్రాంతి శుకాంక్షలు తెలిలారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

## మిసెస్ ఇండియా తెలంగాణ కిరీటాన్ని సాధించిన సూధిని సుష్మా రెడ్డి



**విశ్వంభర, వెల్దండ:** మిసెస్ ఇండియా తెలంగాణ గా వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన సూధిని సుష్మా రెడ్డి నిలిచారు. 2025 సంవత్సరానికి గా ను నిర్వహించిన మిసెస్ ఇండియా పోటీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ల నుండి పోటీలో నిలిచిన సూధిని సుష్మారెడ్డి మిసెస్ ఇండియా కిరీటాన్ని సాధించారు. మోస్ట్ పాపులర్ మోస్ట్ డెలిగేట్ టైటిల్సును సైతం కైవసం చేసుకున్నారు. సుష్మా రెడ్డి నాలుగు శాఖలతో కూడిన శ్రేష్ట మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ సీఈఓ గా, శ్రేష్ట ఫౌండేషన్ సహ వ్యవస్థాపకురాలుగా, వ్యవహరిస్తున్నారు. ప్రతిష్టాత్మక పౌడెంట్ డెంటల్ ఆస్కర్ అవార్డు గ్రహీ తగా నిలిచారు. రెండు తెలంగాణ బుక్ ఆఫ్ రికా ర్డ్ ను నెలకొల్పారు. సుష్మా రెడ్డి స్వీయ సాధికా రిక ద్వారా మహిళా సాధికారిత మరియు సమా జ సేవ పట్ల మక్కువతో అనేక మంది జీవితాల ను ప్రభావితం చేశారు. సుష్మా రెడ్డి మిసెస్ ఇండి యా కిరీటాన్ని సొంతం చేసుకున్న సందర్భంగా మండల ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బ్యాంక్‌మెన్ వాసవి వృద్ధాశ్రమం కుటీర్‌లో రంగోలీ పోటీలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** బ్యాంక్‌మెన్ వాసవి వృద్ధాశ్రమం కుటీర్‌లో సంక్రాంతి పర్వదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సనాతన హైందవ సాంప్రదాయాలను ప్రతిబింబించే రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో కుటీర్ పరిసరవాసులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, వివిధ థీమ్‌లతో రంగు రంగుల రంగోలీలు చిత్రించి తమ సృజనాత్మకతను, కళాభిరుచిని ప్రదర్శించారు. అధ్యక్షులు పీవీ రమణయ్య, కార్యదర్శి పీ కే బాలాజీ నేతృత్వంలో జరిగిన కార్యక్రమాన్ని రోటేరియన్ రమేష్ కె గ్రాంధి, పడకంటి జ్యోతిలు విజయవంతంగా నిర్వహించారు. ఈ వేడుకకు ట్రస్టీలు మారం లక్ష్మయ్య, శ్రీ బైసాని వి ఎస్ ఎన్ గుప్తా, తమ్మన సుశీల లు అతిథులుగా హాజరయ్యారు. పోటీలో విజేతలకు బహుమతులను జగిని ఫర్నీచర్ అధినేత జగిని శ్రీనివాస్ స్పాన్సర్ చేశారు. మొదటి, రెండవ, మూడవ బహుమతులు, ప్రోత్సాహక బహుమతులు, మెమెంటోలు అందజేశారు.

# సమస్యలపై రవాణారంగ కార్మికులు ఉద్యమించాలి

**- పాలడుగు భాస్కర్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**విశ్వంభర, హైదరాబాద్:** ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్టీ డబ్ల్యుఎఫ్) నగర కమిటీ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విచ్చేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి ఎం వెంకటేష్ తో కలిసి క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన అనంతరం భాస్కర్ మాట్లాడారు. గత పది సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం అనేక కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిందని, రవాణా రంగంలో డ్రైవర్లని ఇతర కార్మిక వర్గాన్ని ఇబ్బందులు పాలు చేసే విధంగా యాక్టులో సింగిల్ ఓనర్ కం డ్రైవర్స్ నీ ప్రైవేటు యాజమాన్యాల కబంధహస్తాల్లోకి వెళ్లిపోయే విధంగా అగ్రిగేటర్స్ కు అవకాశం ఇచ్చారని, బీ ఎన్ ఎస్ 106 సెక్షన్ నీ తీసుకొచ్చారని, కార్మిక చట్టాలని లేబర్ కోడ్స్ గా మార్చి యాజమాన్యాలకు ఊడిగం చేసే విధంగా చట్టాలను తయారు చేశారని, వీటిని రేపు ఏప్రిల్ ఒకటి లోపు ఎప్పుడైనా అమలు చేయొచ్చు ఇవి అమలు చేస్తామని ప్రకటించిన వెంటనే రాష్ట్రం లోని అన్ని కార్మిక సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు తో కలిపి మిలిటెంట్ ఉద్యమాలు చేయడానికి ట్రేడ్ యూనియన్స్ సిద్ధమవుతున్నాయన్నారు. రవాణా రంగ కార్మికులు కూడా తమ సమస్యలపై ఉద్యమించే దానిలో భాగంగా ఈ మిలిటెంట్ ఉద్యమంలో భాగస్వామ్యం కావాల నీ చెప్పారు. తమపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా శాఖ అధికారులు వేస్తున్న పెనాల్టీలు చలాన్లు ట్యాక్స్ పెంపు టోల్గేట్ చార్జీ లు పెంపు వంటి ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా డ్రైవర్ల ఇతర కార్మిక వర్గం ఏకం కావాలి ఐక్యంగా ఉద్యమించాలి ఈ సంవత్సరం మొత్తం క్యాలెండర్ ప్లాన్ వేసుకొని ఏఐఆర్టీడబ్ల్యుఎఫ్ కార్మిక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేష్, నగర ఉపాధ్యక్షులు వి కామేష్ బాబు, జె రాములు, ఏ ఐ ఆర్ టి డబ్ల్యూ ఎఫ్ నాయకులు బి లక్ష్మణ్ ఎండి మాజీద్, ఎండి మోయిన్, ఎండి అర్బాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు .కార్యక్రమానికి ఏఐఆర్టీ డబ్ల్యూఏ ఎఫ్ నగర కార్యదర్శి కే అజయ్ బాబు అధ్యక్షత వహించారు.

## ప్రధాని మోదీకి పాలాభిషేకం



**విశ్వంభర, నెల్లికుదురు:** రైతుల కల నిజం చేస్తూ రాష్ట్రం లో పసుపు బోర్డు ప్రారంభించడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటాలకు బీజేపీ మండల అధ్యక్షుడు చందు రాజు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుగులోతు మదన్లాల్ మాట్లాడుతూ రైతులు కలలుకన్న మాట నిలబెట్టుకోవడంలో ప్రధాని మోదీ బీజేపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రధాని మోడీకి, ఎంపీ అరవిందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు చందు రాజు, పొచా రావు, భవాని ప్రసాద్, యుగేందర్, రాస రాకిరెడ్డి, తోట రమేష్, యాకి రెడ్డి, హరికృష్ణ, యాకయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్




**విశ్వంభర, చేవెళ్ల:** చేవెళ్ల మండల కేంద్రంలోని ఊరెళ్ళ గ్రామంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కర్నే శ్రీశైలం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ కర్నే శివప్రసాద్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, బీజేపీ యువ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి మరియు జడ్పీటీసీ మర్పల్లి కృష్ణా రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా డాక్టర్ వైభవ్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు యువతకు చాలా అవసరమని మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. అలాగే యువతకు క్రీడల పట్ల శ్రద్ధ చూపించడం అవసరమని అని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం గుప్తా, వెంకటేష్, విట్టలయ్య, మాజీ సర్పంచ్ జహంగీర్, వీరేశం, యాదయ్య, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## శబరికి బయలుదేరిన అయ్యప్ప భక్తులు



**విశ్వంభర, అంబర్ పేట్:** అయ్యప్ప మాలవేసి 48 రోజులు అయ్యప్ప దీక్షను నిష్టతో పూర్తి చేసి అంబర్ పేట్ డీడీ కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఇరుముడి కట్టుకొని హరిహర సుతిని దర్శనార్థం శబరిమలై వెళ్లిన ప్రవీణ్ స్వామి గణేష్ రవికాంత్ వెంకట్ తదితరులు.

## ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, సిద్దిపేట:** బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో పుల్లూరు ఉమేష్ అధ్యక్షతన పార్టీ జాతీయ అధ్యక్షురాలు, యూపీ మాజీ ముఖ్యమంత్రి మాయావతి 69వ జన్మదిన వేడుకలను సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ దగ్గర ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, పంగ బాబు హాజరై మాట్లాడారు. మహాత్మ జ్యోతిభాపూలే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకపోవడం కోసం మాన్యశ్రీ కాన్షీరం స్థాపించిన బహుజన్ సమాజ్ పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ కు మాయావతిని నాలుగు సార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత బీఎస్పీదేనని అన్నారు. బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా మహనీయులు చేసిన త్యాగాన్ని గుర్తుచేస్తూ రానున్న రోజుల్లో మాయావతిని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పార్టీ కోసం కృషి చేయాలన్నారు. అనంతరం పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట అసెంబ్లీ ఉపాధ్యక్షుడు కొండ పలకల సంపత్, అసెంబ్లీ కోశాధికారి మహేష్, జిల్లా ఈసీ మెంబర్ కథా మహేష్ , నంగునూరు అధ్యక్షుడు ముంద్రాతి లింగం, రూరల్ మండల అధ్యక్షుడు కర్రె హరికిరణ్, భాస్కర్, అజయ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కిడ్నీ సంబంధిత వ్యాధితో వ్యక్తి మృతి



**విశ్వంభర, జూలూరుపాడు:** మండల పరిధి లోని అనంతారం గ్రామంలో మందెరకల సత్యనారాయణ (43) గత కొంత కాలంగా కిడ్ని వ్యాదితో బాధపడుతున్నాడు. డయాలసిస్ చేసుకుంటూ మంగళవారం రాత్రి మృతి చెందారు. అనంతారం గ్రామంలో గత 6 నెలల కాలంలో కిడ్ని వ్యాదీతో ఇప్పటి వరకు అనేక మంది మృత్యువాత పడ్డారు. సరైన వైద్యం చేపించే స్తోమత లేక చిన్న వయసులోనే ఇలా మృత్యువాత పడటం బాధాకరమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి అనంతారం గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తే, ఈ కిడ్నీ మహామ్మారీని తరిమివేయవచ్చని ప్రజలు కోరుకుంటున్నారు.



**సంక్రాంతి పండుగ సందర్భంగా పి.ఏ.సి ఛైర్మన్, శేర్లింగంపల్లి ఎంఎల్ఏ ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్ లోని వారి నివాసంలో మర్యాద-పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన నాయకులు కావూరి అనిల్, పోతుల రాజేందర్, కాశినాథ్ యాదవ్, ఆనంద్ తదితరులు. (విశ్వంభర, కూకట్ పల్లి)**

## "ఎగురుతోంది ఎగురుతోంది మువ్వన్నెల జెండా"

**- సాహితీవేత్త డా.చిటికెన కిరణ్ కుమార్**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన పలు జాతీయ అంతర్జాతీయ అవార్డుల గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త, ఇంటర్నేషనల్ బెనెవోలెంట్ రీసెర్చ్ ఫోరమ్ సభ్యులు డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్ రచించిన "ఎగురుతోంది ఎగురుతోంది మువ్వన్నెల జెండా" గేయాన్ని హైదరాబాద్ లోని పలు పాఠశాలలలో బోర్డులపై వ్రాసి, డిజిటల్ స్క్రీన్ లపై ప్రదర్శిస్తూ విద్యార్థులకు ఉపాధ్యాయులు నేర్పుతున్నారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ దేశభక్తి గేయాలు,సామాజిక ఇతివృత్తంతో మానవీయ కోణంగా గతంలో తన రచనలు అనేకంగా గేయాలు, కథలు, కవితలు, వ్యాసాలు వెలువడినాయన్నారు. తను రచించిన ఓ తండ్రి తీర్పు లఘు చిత్రంనకు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులు లభించాయన్నారు. "ఎగురుతోంది ఎగురుతోంది మువ్వన్నెల జెండా" అంటూ రాసిన గేయం యూట్యూబ్ ద్వారా వైరల్ అవుతుందని, జెండా యొక్క మూడు రంగుల విశిష్టతను ఒక ప్రత్యేక కోణంలో రచించడమైనదన్నారు. త్యాగధనుల ఫలంగా లభించిన భారత స్వాతంత్రం గురించి తెలుసుకోవలసింది ఎంతైనా ఉన్నదన్నారు. కుల, మత, వర్గ,వర్ణములకు అతీతంగా ఎందరో మంది ఆత్మతర్పణం చేయగా సిద్ధించిన మన స్వాతంత్రాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖులు, మానేరు రచయితల సంఘం డా.పత్తిపాక మోహన్, ఎలగొండ రవి, జిందం అశోక్, బూర దేవానందం, వంశీ, స్థానిక కవులు రచయితలు చిటికెన కిరణ్ కుమార్ కు అభినందనలు తెలిపారు.

## సంక్రాంతి కానుకగా పసుపు బోర్డు ప్రకటించిన నరేంద్ర మోదీ

*** జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ గా పల్లె గంగారెడ్డి**



**విశ్వంభర, కోరుట్ల:** ఇందూరు రైతుల పక్షాన రైతులకు కోరిక మేరకు పసుపు బోర్డు ప్రకటించిన భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అమిత్ షా పర్చువాల్ గా పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ లకు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించి మాట తప్పని మడిమతిప్పని ఇందూర్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ గా నియమితులైన పల్లె గంగారెడ్డి లకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ మరియు బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా సురభి నవీన్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిక్షణం రైతుల శ్రేయస్సు కోరే గొప్ప నాయకుడని పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు మంచి ధరతో పాటు ఆర్థిక అభివృద్ధి తోడ్పాటు ఉంటుందని బీజేపీ కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ అన్నారు.

## కేసముద్రంలో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టివేత

*** వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ సర్వయ్య**




**విశ్వంభర, మహబూబాబాద్:** కేసముద్రం ఎస్ఐ మురళీదర్ తన సిబ్బందితో బుధవారం ఉదయం కోరుకొండపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా, అనుమానాస్పదంగా ఒక తెల్లని ఎర్టిగా ( టీఎస్ 07 యూపీ 0754) కారులో నూజివీడుకు చెందిన ఆటో డ్రైవర్ పఠాన్ అస్లాం ఖాన్ (28) తండ్రి అశ్రఫ్ ఖాన్, చల్లపల్లి వైజాగ్ కి చెందిన క్యాబ్ డ్రైవర్ వెదుల ప్రదీప్ కుమార్ (32)తండ్రి శ్రీనివాస మూర్తి లు అక్రమంగా వైజాగ్ దగ్గర గల సీలేరు నుండి ఎండు గంజాయిని వాహనంలో తీసుకు వస్తూ పట్టుబడ్డారని, వారిని అదుపులోకి తీసుకొని 5 కిలోల గంజాయిని ( విలువ రూ. 125000 /), కారును, రెండు మొబైల్ ఫోన్ లను సీజ్ చేయడం జరిగిందని, వారిని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య వెల్లడించారు. ఈ కేసు విషయంలో మహబూబాబాద్ రూరల్ సీఐ పి. సర్వయ్య, కేసముద్రం ఎస్ఐ మురళీధర్, సిబ్బంది రాజు, రామకృష్ణ, మహేందర్, వెంకన్న, మధులను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ అభినందించారు.

## తిరుగు ప్రయాణికుల కోసం సరిపడా బస్సులు ఏర్పాటు

*** వెల్లడించిన మెట్ పల్లి డిపో మేనేజర్**




**విశ్వంభర, మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ బస్సు డిపో మేనేజర్ దేవరాజ్ డిపో సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దేవరాజ్ మాట్లాడుతూ హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుండి మెట్ పల్లి డిపో పరిధిలో గల గ్రామాలకు పండుగ సందర్భంగా అధిక సంఖ్యలో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన దృశ్య తిరుగు ప్రయాణంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణికులకు సరిపడా బస్సులను దూరప్రాంతాలకు నడుపుతున్నట్టు తెలియజేశారు. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండల కేంద్రాల నుండి, ఖానాపూర్ నుండి హైదరాబాద్ కు స్పెషల్ బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు తెలియజేశారు. మెట్ పల్లి బస్సు డిపో రిజన్ లోనే అన్ని రంగాలలో నెంబర్ వన్ స్థానంలో గుర్తింపు పొందినదని, గుర్తింపు రావడానికి కృషిచేసిన డ్రైవర్లకు కండక్టర్లకు డిపో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో స్టాఫ్ పాల్గొన్నారు.

## దేవరుప్పల మండల బీజేపీ అధ్యక్షుడిగా పెద్దగౌని రాజు గౌడ్

**విశ్వంభర, జనగామ:** దేవరుప్పుల మండలం పెద్దమదూర్ గ్రామానికి చెందిన పెద్దగౌని రాజు దేవరుప్పుల మండల నూతన అధ్యక్షుడిగా బీజేపీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా పెద్దగౌని రాజు మాట్లాడుతూ నాపై నమ్మకంతో దేవరుప్పుల మండల అధ్యక్షుడిగా నియమించిన తెలంగాణ బీజేపీ రాష్ట్ర పార్టీకి, జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంత్ రెడ్డికి, బీజేపీ నేతలు కేవీఎల్ఎన్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, ఉడుగుల రమేష్, లేగా రాంమోహన్ రెడ్డి, కొంతం శ్రీనివాస్, శివరాజ్ యాదవ్, జనగామ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ గౌడ్, పాలకుర్తి నియోజకవర్గ నాయకులు దొంగరి మహేందర్, రంగు రాములు, పూసాల శ్రీమాన్, సుంకరనేని కొటేశ్వర్ రావు లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవరుప్పుల మండలంలో బీజేపీ పటిష్టత కోసం కృషి చేస్తానని, ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ కోసం ఎంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని, అలాగే రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే కృషిగా సాగుతామని, కాంగ్రెస్ పార్టీ సంవత్సరకాలం పాలనపై ప్రజలు విసుకుచెందారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు రైతాంగానికి, ప్రజలకు పూటకో మాట చెబుతూ కాలం వెళ్ళదీస్తున్న పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేరని, రాబోయే రోజుల్లో గ్రామ స్థాయి నుండి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ భారతీయ జనతా పార్టీని మరింత అభివృద్ధి కోసం పాటుపడుతామని తెలిపారు.

## మాంజా దారంతో గాయపడిన ట్రాఫిక్ పోలీస్



**విశ్వంభర, హైదరాబాద్:** లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌గా పని చేస్తున్న శివరాజ్ మంగళవారం నారాయణగూడ నుండి తిలక్ నగర్ రోడ్డు వైపు ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా నారాయణగూడ ఫ్లైఓవర్ నుండి క్రిందికి దిగుతున్న సమయంలో పతంగి మాంజా అతని మెడకు తగిలి కోసుకుంది. ట్రాఫిక్ పోలీస్‌గా పని చేస్తున్న శివరాజ్ తనకు జరిగిన ప్రమాదం గురించి నారాయణగూడ పోలీస్ ల దృష్టికీ రావడంతో పోలీస్ లు జరిగిన ప్రమాదం పై కేస్ నమోదు చేశారు.

## ఉద్యోగాలివ్వాలని ఎమ్మెల్యేకు వినతి



**విశ్వంభర, నెల్లికుదురు:** ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగాలివ్వాలని కోరుతూ ఎమ్మెల్యే మురళీ నాయక్ కు బుధవారం జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కళాకారులు చెప్పారు. అనంతరం శుక్రవారం హనుమకొండ నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో జరిగే పాటల పల్లకి ప్రోగ్రాం పోస్టర్ను ఆవిష్కరించారు. కార్యక్రమం సంఘం అధ్యక్ష , కార్యదర్శులు కేదాస్ రమేష్, పగిడి పాల వెంకటరావు, పంజాల బుచ్చి రాములు, మెరుగు భద్రయ్య , పసునూరి జంపయ్య , గాదుదు ల వీరన్న, ఉప్పలయ్య , స్వప్న , శ్రీనివాస్ , హరిత, భాగ్యలక్ష్మి , రవివర్మ , తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామం హైస్కూల్లో 2002 2003 పదవ తరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ లోని తంగేడు వనంలో పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట కలుసుకొని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తంగేడు వనంలో ఏర్పాటుచేసిన వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పూర్వ విద్యార్థులు చదువుకునే సమయంలో గురువులు చెప్పిన మంచి మాటలను ఒక్కొక్కటి నెమరు వేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి గుర్తుండే విధంగా జ్ఞాపికలను అందించారు.

## ఘనంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల పరిధిలోని హోమంతాలపల్లి గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మీ పెరుమాళ్ ఆలయం వద్ద సుమారుగా 120 సంవత్సరాల నుండి కొనసాగుతున్న ఫలహారపు ఎడ్ల బండ్ల ఊరేగింపు ఆనవాహితిగా ఈ ఏడాది కూడా సాంప్రదాయ బద్దంగా కొనసాగింది. మకర సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం గ్రామస్థులు ఉపవాస దీక్షలో ఉండి ఎడ్ల బండ్లను అలకరించి గ్రామ పురావిధులలో డప్పు చప్పుల్ల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెరుమాళ్ళకు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గుడి చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు మాడ్గుల, దేవరకొండ మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఎడ్ల బండ్ల ఊరేగింపును తిలకించారు. ఎలాంటి అవాచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహహించారు.



**ఆర్కేపురం డివిజన్ చిత్రా లేఔట్ కాలనీలో భోగి పండుగ సంబరాలు చిత్రా లేఔట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు ఆనందోత్సాహల మధ్య పల్లెటూరి వాతావరణాన్ని తల-పిస్తూ హరిదాసు కీర్తనలు, బసవన్నల ఆటలతో సందడిగా నెలకొంది. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు పెండ్యాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.**

**( విశ్వంభర, ఎల్బీనగర్)**

విశ్వంభర V3 NEWS

# మీరు కుంభమేళాకు వెళుతున్నారా..

**ఇప్పటికే అక్కడికి వెళ్లి వచ్చిన వారి సూచనలు వినండి**



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** మీరు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా కు వెళుతుంటే, అనుభవజ్ఞుడైన వ్యక్తి తన ఫేస్‌బుక్ ఖాతాలో రాసిన ఈ చిట్కాలు మీకు ఉపయోగకరంగా ఉండవచ్చు. శ్రీనిధి దీపక్ తన కుంభమేళా అనుభవాన్ని పంచుకున్నారు. కుంభమేళా గంగానది మైదానంలో జరుగుతోంది. వర్షాకాలం తర్వాత విశాలంగా ప్రవహించే గంగా నది తగ్గడం ప్రారంభిస్తుంది. ఈ ప్రదేశంలో కుంభమేళా కోసం ప్రత్యేకంగా నిర్మించిన నగరంలో కుంభమేళా జరుగుతోంది. మళ్ళీ వర్షాకాలం వచ్చినప్పుడు, ఈ కృత్రిమ నగరం నీటిలో మునిగిపోతుంది. ఈ నగరాన్ని మొత్తం నలభై చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కృత్రిమంగా నిర్మించారు. మనం ఒకటి లేదా రెండు రోజులు ప్లాన్ చేసుకుంటే, కుంభమేళా మొత్తాన్ని చూడలేము. అవన్నీ చూడటానికి ఒక నెల కూడా సరిపోదు. ఇనుప ప్లేట్స్‌తో తయారు చేయబడిన ఆ రోడ్డు దాదాపు 400 కి.మీ. పొడవు ఉంటుంది. యదతదంగా కాబట్టి మీరు ముందుగానే చూడవలసిన వాటి జాబితాను తయారు చేసుకోవాలి. ఇక్కడ ఇప్పుడు ఎక్కడా రవాణా వ్యవస్థ లేదు. మీరు నడిచి ప్రయాణించాలి. ఈసారి ఈ కుంభ నగరంలో మొత్తం 25 సెక్టార్లు ఉన్నాయి, వీటిని గంగా నది ఒడ్డున నిర్మించారు. ఈ రంగాలు ఎక్కడ ఉన్నాయో, ఏ ప్రాంతంలో ఉన్నాయో మీరు తెలుసుకోవాలి. ఈ రంగాలను అనుసంధానించడానికి నదిపై 30 వంతెనలు నిర్మించబడ్డాయి. వీటికి సంఖ్యలు ఇవ్వబడ్డాయి. అక్కడికి చేరుకోవడానికి మరియు తిరిగి రావడానికి మీరు వేర్వేరు వంతెనలను ఉపయోగించాలి. తొక్కిసలాటను నివారించడానికి ఈ ఏర్పాటు చేశారు. ఈ వంతెనపై మీరు ఒక్కసారి పొరపాటు పడినా, పదుల కిలోమీటర్లు నడవవలసి వస్తుంది. మీరు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావచ్చు. నువ్వు వదిలేసిన బ్రిడ్జి మీద నుంచి పోలీసులు తిరిగి రానివ్వరు. నది ఒడ్డున వివిధ సాధువుల రంగస్థలాలు మరియు ఆలయాలు ఉన్నాయి. నిరంతర భజనలు మరియు హరికథలు కొనసాగుతాయి. మీరు చాలా దూరం వెళ్ళినా, అది పెద్ద సమస్య కాదు. చాలా మంది నాగ సాధువులను చూడటానికి కుంభమేళాకు వస్తారు. నాగ సాధువుల రంగం ఎక్కడ ఉందో ముందుగానే తెలుసుకోవడం ఉత్తమం. మీరు ఫోటోగ్రాఫర్ అయితే, మంచి దృశ్యాన్ని పొందడానికి కనీసం 2025 కి.మీ ప్రయాణించాలి. నడక తప్పనిసరి. వాతావరణం విషయానికొస్తే, ఫిబ్రవరి నెల కాబట్టి చాలా చల్లగా ఉంటుంది. వాతావరణ యాప్‌లోని వాతావరణం ఇక్కడి వాతావరణానికి భిన్నంగా ఉంటుంది. గంగానది నుండి వీచే చల్లని గాలులు కారణంగా ఉష్ణోగ్రత 5 డిగ్రీల చుట్టూ ఉంటుంది. కాబట్టి, స్వెటర్, గ్లౌజులు మరియు టోపీని తీసుకురావడం తప్పనిసరి. మంచి నాణ్యత గల బూట్లు ఉండాలి. భోజనం లేదా స్నాక్స్ తో ఎటువంటి సమస్య లేదు. ప్రతిచోటా ఉచిత ఆహారం అందించబడుతోంది. సాధువుల గుడారాల దగ్గర ఆహార పంపిణీ సర్వసాధారణం. అదనంగా, వందలాది హోటళ్ళు తెరిచి ఉన్నాయి. భోజనం చేయడానికి మంచి స్థలాన్ని కనుగొనండి. షాహి స్నానానికి వెళ్ళేటప్పుడు జాగ్రత్త అవసరం. చాలా మంది ఉంటారు. ఖరీదైన ఆభరణాలు మెడలోవేసి ధరించవద్దు. త్రివేణి సంగమ ప్రదేశంలో నాగ సాధువులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. నది ఒడ్డున ఎక్కడ స్థలం ఉంటే అక్కడ స్నానం చేయడం ఉత్తమం. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. తప్పిపోయిన వ్యక్తులను కనుగొనడానికి చుట్టూ కేంద్రాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. మొబైల్ నెట్‌వర్క్‌ను మెరుగుపరచడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. ఉచిత వైఫై ఉంది. మీరు వసతి ఏర్పాట్లు చేసుకోవాలనుకుంటే, త్రివేణి సంగమం నుండి ఆరు నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండటం ఉత్తమ ఎంపిక. లోపల హోటల్/టెంట్ దొరుకుతుందేమో చూడండి. ఎందుకంటే మీరు అంత దూరం నడవాలి. మీరు దూరంగా ఉంటే, కుంభమేళాకు నదిని వెళ్ళడానికి ఒక రోజు పడుతుంది. కుంభమేళాకు బయలుదేరే ముందు మీరు ఇవన్నీ సిద్ధం చేసుకుంటే, మీరు లక్ష్యం లేకుండా తిరుగుతూ ఉండకుండా ఉంటారు.

## లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే




**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు గ్రామంలోని బట్లగూడెంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆయలాన్ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి సంక్రాంతి పండుగ సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండి పాడి పంటలు, ఆయు ఆరోగ్యాలతో వుండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దొంతం అలివేలు సంజీవ రెడ్డి, నాయిని జమున మాధవ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, రవి నాయక్, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, మాజీ ఎంపీటీసీ సదానందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు, ఆంధ్ర రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు లాభాలు చేకూర్చాలని మైసమ్మకు పూజలు



**విశ్వంభర, కడ్తాల్:** కనుమ పండుగ సందర్భంగా కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం లో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో, ప్రేమతో కలిసిమెలిసి ఉండాలని, వర్షాలు పడి పంటలు దిగుబడి బాగా రావాలని, పశు సంపద పెరగాలని, రైతులు లాభాల బాట పట్టి సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో హీరాసింగ్ నాయక్, జహంగీర్ లాల్ నాయక్, శేఖర్ గౌడ్, మల్లేష్ నాయక్, తులసి రాం నాయక్ నర్సింహా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ వైస్ ఎంపీపీ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు:** అమనగల్లు మండల మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి జన్మదిన వేడుకలు అమనగల్లు మండలం మంగళపల్లి గ్రామపంచాయతీ లోని వారి స్వగృహంలో కె.ఎన్.ఆర్ యూవ సేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువతో సన్మానించి ఘనంగా నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ అనంత రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డ, రేవతి రెడ్డి సురేందర్ రెడ్డ, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ నర్సింహ రెడ్డి, కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గోవులకు పండ్లు తినిపించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, వరంగల్:** ముంగిళ్లలో మెరిసే రంగువల్లులు, తెలుగుదనాన్ని తట్టి లేపే బంగారు తల్లులు బసవన్నల ఆటపాటలు, సంక్రాంతి సరదాలు, ఈ కనుమ మీకు కమ్మని అనుభూతులను అందించాలని కోరుకుంటూ బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 44వ డివిజన్ మామునూర్ లక్ష్మీపురం నివాస క్యాంపు కార్యాలయం నందు కనుమ పర్వదినం సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గోవులకు పండ్లు, ధాన్యం తినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## యాఖుబ్ షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు గిలాఫ్ పంపిన మాజీ ఎమ్మెల్యే

**విశ్వంభర, హనుమకొండ:** ఈ నెల 16 ,17 తేదీలలో అన్నారం షరీఫ్ ఉర్సు ఉత్సవాలకు బుధవారం పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి వారి స్వగృహం నుండి యాఖుబ్ షరీఫ్ దర్గా కు సమర్పించుటకు గిలాఫ్ చాదర్ ను జిల్లా మైనారిటీ నాయకుల ద్వారా పంపించడం జరిగింది. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ అన్నారం షరీఫ్ దర్గా మత సామరస్యానికి ప్రతీక అని ఆ దేవుడి ఆశీస్సులతో అందరు సోదరబావంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు నయీమోద్దీన్, దామెర మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలి, జిల్లా మైనారిటీ నాయకులు జలాలొద్దీన్, ఇస్మాయిల్, సంగెం మాజీ కో అప్షన్ మన్సూర్ అలి ,స్షకీల్,సలీమ్, ఆరిఫ్, అజ్మత్,ఆబిద్, ఇక్బాల్,మహమ్మద్ ఖైరత్ ,అఫ్రోజ్ ,అమీనా బీ ,కరీమా బీ,ఆత్మకూరు దామెర అధ్యక్షులు సంజీవరెడ్డి,గండు రాము, పెద్దాపురం సొసైటీ చైర్మన్ బొల్లు రాజు, కొగిలివాయి ఎంపీటీసీ కిరణ్, రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.





## కాలేజి గ్రౌండ్‌లో వృధాగా పారుతున్న కాళేశ్వర గంగా

**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని జూనియర్ కాలేజి వద్ద జెన్కో పైప్ లైన్ లీక్ గోదావరి అనుసంధానమైన నీరు వృథాగా పోతోంది. మండలంలోని కాళేశ్వరం నుండి భూపాలపల్లి కి నీటిని తరలించే జెన్కో పైప్ లైన్ లీక్ కావడంతో కాలేజి గ్రౌండ్ మొత్తం గోదావరి నీటితో నిండిపోతోంది. దీంతో కాలేజీకి వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్ మొత్తం నీటితో నిండిపోవడంతో క్రీడలకు అనుకూలంగా లేకుండాపోతోంది. నిత్యం నీరు నిల్వ ఉండడంతో జూనియర్ కళాశాల విద్యార్థులు మరియు డిగ్రీ విద్యార్థులు చుట్టుపక్కల వారికి దోమలు పెరిగి ఇబ్బందులు కలిగుతున్నా. పలుమార్లు అధికారులకు విన్నవించుకోవడం జరిగింది అయినా కూడా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు వెంటనే స్పందించి జెన్కో పైప్ లైన్ లీకేజీని అరికట్టాలని విద్యార్థులు ప్రజలు కోరుకుంటున్నారు.

## పతంగులను ఎగరేసిన వేణారెడ్డి



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట పట్టణంలోని బొడ్రాయి బజార్ లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి ఎంతో ఉత్సాహంగా పతంగులను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ముగ్గులు, ఆ తరువాత పతంగులు అన్నారు. సంక్రాంతి సందర్భంగా యువత ఎంతో ఉత్సాహంగా కైట్స్ ఎగురవేస్తుంటారు. మహిళలు ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులతో పండుగను జరుపుకోగా మగవారు పతంగులు ఎగురవేస్తూ ఆడి పాడి ఎంజాయ్ చేస్తుంటారని తెలిపారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తుంటారు అని పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు.

## సీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

*** గ్రామాల్లో క్రికెట్ కు ఎనలేని ఆదరణ**

*** కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల గోపాల్ ముదిరాజ్**

**విశ్వంభర, కేశంపేట:** మనదేశంలో క్రికెట్ క్రీడకు ఎంతో ఆదరణ ఉందని మారుమూల పల్లెల్లో సైతం యువకులు క్రీడాకారులు క్రికెట్ ఆడేందుకు ఇష్టపడతారని తుమ్మల గోపాల్ తెలిపారు. కేశంపేట మండలం వేముల నర్వ గ్రామంలో సీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి బహుమతులతోపాటు నగదు ప్రోత్సాహక బహుమతులు తుమ్మల గోపాల్ చేతుల మీదగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఉన్నాడా మల్లేష్ గౌడ్, చిర్ర చంద్రయ్య, చిర్ర శీను, ఎర్ర రాజు, రమేష్, శివ, మల్లేష్, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.



## డీఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు




**విశ్వంభర, నర్సంపేట:** డీఆర్ఆర్ ట్రస్ట్ దాసరిపల్లి వారి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నర్సంపేట మండలం కమ్మపల్లి, దాసరిపల్లి గ్రామంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల కార్యక్రమంలో కమ్మపెల్లి గ్రామం నుండి 35 మంది, దాసరపల్లి గ్రామం నుండి 20 మంది మహిళలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు డి ఆర్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. కమ్మపల్లి గ్రామం నుండి మొదటి బహుమతి కె. లలిత, రెండవ బహుమతి ఆర్. తేజస్విని, మూడవ బహుమతి భార్గవిలకు బహుమతులను అందజేశారు. దాసరి పల్లి గ్రామం నుండి మొదటి బహుమతి సుదగాని ప్రియాంక, రెండవ బహుమతి వల్లాల దివ్యవాణి, మూడవ బహుమతి బుడగొండ స్ఫూర్తి, అందుకోగా మిగతా 25 మందికి కన్సలేషన్ బహుమతుల ప్రధానం చేశారు. ఈ ముగ్గుల పోటీకి జెడ్జిమెంట్ గా కమ్మ పెల్లి నుండి కోమల భాస్కర్ రెడ్డి మరియు గ్రామంలోని పెద్దలు అయినటువంటి వంగ రవీందర్ ముద్దం రవి, లెక్కల మల్లేష్, భాష పైన మల్లేష్, మెరుగు శ్రీకాంత్, పెండ్యాల బిక్షపతి, వంగ మహేందర్, వంగ కొమురయ్య, సట్ల రాజేందర్, కోరే మల్లేశం, బుడగొండ బిక్షపతి, మరియు గ్రామ పెద్దల సమక్షంలో బహుమతులు వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఈ ప్రోగ్రాంకు ఎంతగానో కష్టపడినటువంటి మేకల రాజేందర్ మరియు డీఆర్ఆర్ ఫౌండేషన్ దాసరి, రాజిరెడ్డి లకు మా గ్రామ ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విధంగానే మా గ్రామంలో ఇలాంటి ప్రోగ్రామ్స్ మరిన్ని చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని గ్రామస్తులు తెలిపారు.

## ధర్మ పరిరక్షణ కోసం ఆర్ఎస్ఎస్ నిరంతర కృషి

*** మెదక్ విభాగ్ కార్యవాహ బోలా నాగభూషణం**



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** భారతీయ సంస్కృతి సంప్రదాయాలు సనాతన ధర్మ పరిరక్షణ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ నిరంతరం కృషి చేస్తుందని ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ కార్యవాహ బోల నాగభూషణం అన్నారు. పెద్ద శంకరం పెట్టలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మన జీవన విధానంలో ప్రకృతికి అనుగుణంగా పండుగలు జరుపుకుంటున్నాం అన్నారు. ప్రస్తుతం సూర్యుడు ఉత్తరాయణ కాలంలోకి రావడంతో పాటు మకర రాశిలో ప్రవేశించడం వల్ల మకర సంక్రాంతిని జరుపుకుంటున్నామని పండుగ విశిష్టతను వివరించారు. సమరసత అనే భావనతో అందరూ కలిసి పండుగలు జరుపుకోవాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా గతి విధులు పేరుతో కుటుంబ ప్రబోధన్, సామాజిక సమరసత, పర్యావరణం, ధర్మజాగరణ, గ్రామీణ వికాస్, పౌర హక్కులు ద్వారా చేస్తున్న పనులను స్వయం సేవకులు అందరికీ వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విట్టల్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధు, జిల్లా పర్యావరణ ప్రముఖ రవివర్మ, మాజీ ఎంపీటీసీ సుభాష్ గౌడ్ కందుకూరి రవీందర్, మల్లేశం, దస్వంత్, ఆర్ఎస్ఎస్, వీ హెచ్ పీ బాధ్యులు జైహింద్ రెడ్డి, సీతారామారావు, సతీష్‌గౌడ్, శ్రీనివాస్, ఆనంద్ కుమార్, సంతోష్‌కుమార్, మధు, శ్రీకాంత్ శైలేష్, అధిక సంఖ్యలో యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు రూ.1లక్ష విరాళం



**విశ్వంభర, నాగారం:** నాగారం మండల కేంద్రంలో కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించనున్న సర్దార్ సర్వాయ్ పాపన్న విగ్రహ ఏర్పాటుకు జాజిరెడ్డిగూడెం మండలంలోని అడివెంల గ్రామానికి చెందిన రేఖ చారిట్రబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బోయినపల్లి రేఖ రూ.1 లక్షను బుధవారం గీత కార్మిక సంఘానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగారంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ప్రతిష్టించడం అభినందనీయమన్నారు. సామాన్య గౌడ కుటుంబంలో పుట్టి, బహుజనులను ఏకంచేసి రాజ్యమేలిన మహావీరుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. యువత పాపన్న స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జాజుల వీరయ్య, కన్నెబోయిన వెంకటబిక్షం, అక్కెనపల్లి వెంకన్న, క్రాంతి, గౌడ సంఘం నాయకులు ఆనంతుల వెంకటయ్య, ఆనంతుల యాదగిరి, ఆనంతుల సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రదానం



**విశ్వంభర, పరిగి:** పరిగి మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి బుధవారం పరిగి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సయ్యద్ అయ్యుబ్ డీసీసీ ఉపాధ్యక్షులు లాల్ కృష్ణ హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఆయూబ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. క్రీడల పోటీలతో గ్రామాలలో ప్రజల మధ్య ఐక్యమత్యం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేష్ నాయకులు మాణిక్యం, శ్రీధర్, రాజేందర్, చిన్న నర్సింలు, సర్వర్, వెంకటేష్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో కీలక పరిణామం

- ఇజ్రాయెల్-హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం
- గాజాలో శాంతి స్థాపన కోసం ఇరు పక్షాలు అంగీకారం
- 15 నెలలుగా జరుగుతున్న భీకర పోరాటానికి ముగింపు



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. గాజాలో శాంతి స్థాపన కోసం ఇరు పక్షాలు అంగీకరించాయి. కాల్పుల విరమణ ఒప్పందం, బందీల విడుదలకు సంబంధించి మధ్యవర్తులకు తమ ప్రతినిధి బృందం అంగీకారం తెలిపిందని హమాస్ పేర్కొంది. ఈ విషయాన్ని ప్రముఖ వార్త ఏజెన్సీ రాయిటర్స్ పేర్కొంది. దీంతో 15 నెలలుగా జరుగుతున్న భీకర పోరాటానికి ముగింపు పలికినట్లైంది. తొలుత 6 వారాల పాటు ఈ ఒప్పందం అమలులో ఉండనుంది. ఇందులో భాగంగా ఇజ్రాయెల్ బలగాలు గాజాను క్రమంగా వీడుతాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి ఖతార్ మధ్యవర్తిత్వం వహించింది. కొన్నినెలలుగా కాల్పుల విరమణ కోసం ఈజిప్టు, ఖతార్ ఇరు పక్షాలతో చర్చలు జరుపుతూ వచ్చాయి. ఈ ఒప్పందానికి అమెరికా మొదటి నుంచి మద్దతుగా ఉంది.

**హమాస్‌పై ఇజ్రాయెల్ భీకరంగా..**

కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన వేళ ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ తన యూరప్ పర్యటనను మధ్యలోనే తగ్గించుకొని సెక్యూరిటీ కేబినెట్ సమావేశంలో పాల్గొనేందుకు స్వదేశానికి బయలుదేరారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 1200 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు చనిపోగా, 250 మందిని హమాస్ మిలిటెంట్లు బందీలుగా చేసుకున్నారు. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడింది. హమాస్ అగ్రనేత ఇస్మాయెల్ హనియా, అక్టోబర్ 7 నాటి ఘటనకు సూత్రధారి యహ్యా సిన్వార్‌తోపాటు కీలక నేతలను హతమార్చింది. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 46,000 మందికిపైగానే పాలస్తీనీయులు మృతిచెందారు.

## ముగ్గులకు సంస్కృతి సంప్రదాయాల్లో ఎంతో విశిష్టత

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**విశ్వంభర, పటాన్ చేరు:** ముగ్గులకు హిందూ సంస్కృతి సంప్రదాయాల్లో ఎంతో విశిష్టత ఉందని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని ముత్తంగి సాయి ప్రియ కాలనీలో సీనియర్ నాయకులు ఆబేద్, మేరాజ్ ఖాన్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని మహిళల కోసం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పండగ విశిష్టతను ప్రతిబింబించేలా ముగ్గులు వేయడం పట్ల ఆయన మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోటీలలో పాల్గొన్న 126 మంది మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ ఆత్మ కమిటీ ఛైర్మన్ కుమార్ గౌడ్, రామకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

## కల్వరి క్రీస్తు మహిమ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**విశ్వంభర, జూలూరుపాడు:** గత సంవత్సరమునుండి రెండు కిడ్నీలు చెడిపోయి బాధపడుతున్న దామెర్ల శివ పడమటి నర్సాపురం గ్రామం, జూలూరుపాడు మండల వాసికి కల్వరి క్రీస్తు మహిమ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ట్రస్ట్ అధినేత, దామెర్ల కృష్ణయ్య (పాస్టర్ తిమోతి ) మాట్లాడుతూ శివ కిడ్నీ ట్రాన్స్ పంటేష్న్ కిడ్నీ మార్పిడి కొరకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి చేయూత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డి. రాణి, బి. శ్రీను, కె. అనూష, యస్. సరోజినీ, డి. సావిత్రి , ముత్తమ్మ పాల్గొన్నారు.

## సగర ఉప్పర సంఘం మండల అధ్యక్షుడిగా జూకంటి సురేష్



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని సగర ఉప్పర సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా సగర ఉప్పర హడాహక్ కమిటీ కన్వీనర్ కురిమిళ్ళ కుమారస్వామి, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎంజాల రమేష్, రాజన్న, శ్రీధర్, సుధాకర్ ఆధ్వర్యంలో జూకంటి సురేష్ ను మండల ఉప్పర సగర సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ నాకు అవకాశం కల్పించి అధ్యక్షునిగా ఎన్నుకున్న పెద్దలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటూ నాకిచ్చిన అవకాశాన్ని అందరి సలహాలు సూచనలతో ముందుకు పోతానని సగర ఉప్పర సంఘం కృషికి ఎల్లవేళలా నా వంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా పోలంపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జూకంటి రాజేందర్, కోశాధికారిగా జూకొంటి సందీప్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కుదుపాక కృష్ణ, కానిగంటి కిరణ్, సంయుక్త కార్యదర్శిగా ఆయిలి సాంబమూర్తి, పోతుల రాకేష్, ప్రచార కార్యదర్శిగా మస్క రాజశేఖర్ నియమితులయ్యారు.

## ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత



**విశ్వంభర, జనగామ:** సంక్రాంతి పండుగ సందర్భంగా దేవరుప్పుల మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో దేవరుప్పుల పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ మహిళలకు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులను,అలాగే ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారందరికీ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వర్కాల వెంకటయ్యకు ఎస్ఐగా పదోన్నతి



**విశ్వంభర, నాగారం:** సూర్యాపేట జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న వర్కాల వెంకటయ్య(వెంకట రాములు) ఎస్ఐ గా పదోన్నతి పొందారు. బుధవారం జిల్లా ఎస్పీ ఎస్ఐ బ్యాడ్జి ని అందజేసి అభినందించారు. నెమ్మికల్ గ్రామానికి చెందిన వెంకటయ్య పోలీసు శాఖలో కానిస్టేబుల్ గా ఉద్యోగం పొంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అంచలంచలుగా పదోన్నతులు పొంది ఎస్ఐ గా ఎదిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. పదోన్నతి పొందడం ఎంతో గర్వంగా ఉన్నదని అన్నారు. ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఎస్ఐ గా పాదోన్నతి పొందడం తో నాగారం మండలం ఎస్ఐ ఐలయ్య, పోలీసు స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

## కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



**విశ్వంభర, మునుగోడు:** పలివెల గ్రామంలో ఇటీవల మరణించిన బీజేపీ కార్యకర్త కుటుంబ సభ్యులను బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి పరామర్శించి 10,000లు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. అనంతరం ఇపర్తి గ్రామంలో బీజేపీ నాయకుడు గోలి లింగస్వామి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటులో పాల్గొని క్రికెట్ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పెంబల్ల జానయ్య , బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణు కుమార్ , జిల్లా కార్యదర్శి బొడిగ అశోక్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు భవన మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మాస శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పులకరం సైదులు, బీజేపీ నాయకులు గోలి లింగస్వామి , జిల్లా నాయకులు మహేశ్వరం గాలయ్య , మండల ఉపాధ్యక్షులు చెల్లాటి బ్రహ్మచారి , కర్నాటి శేఖర్, బక్క యాదయ్య , దళిత మోర్చా మండల అధ్యక్షుడు పందుల యాదయ్య , బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి ఓడిగా స్వామి , లోడే నరసింహ, పంతంగి గోపాల్, బత్తుల వెంకన్న , మాత్ర నవీన్ రెడ్డి , ఎండీ మజీద్ పెరమళ్ళ రాము, లోడే హరీష్, బక్క నరసింహ , బక్క విజయ్, పంతంగి స్వామి , బాసరాజు , నరేష్ , చికినిమెట్ల ఎల్లయ్య , హృతిక్ , బీజేపీ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

## కేజ్రీవాల్‌కు 'ఖలిస్థానీ' ముప్పు!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల సమాచారం. ముఖ్యంగా పాక్ ఐఎస్ఐ మద్దతుతో ఖలిస్థానీ సానుభూతిపరులు ఆయనపై దాడి చేసేందుకు కుట్ర పన్నారని ఢిల్లీ పోలీసులను నిఘావర్గాలు హెచ్చరించినట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. భద్రతను సమీక్షించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ వార్తలపై స్పందించిన కేజ్రీవాల్.. దేవుడిపై తనకున్న విశ్వాసమే తన ప్రాణాలను రక్షిస్తుందని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న కేజ్రీవాల్.. బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నిఘా వర్గాల హెచ్చరికలపై స్పందించారు. ''భగవంతుడు అండగా నిలిచే వారిని ఎవ్వరూ ఏమీ చేయలేరు. దైవం నాతో ఉంది. ఎవరైనా తమ జీవితరేఖ ఉన్నంతకాలం బతుకుతారు. ఆ తర్వాత దేవుడే వారిని తీసుకెళ్తాడు'' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఢిల్లీలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని నిఘా వర్గాల సమాచారం. ముఖ్యంగా అరవింద్ కేజ్రీవాల్ లక్ష్యంగా దాడి జరగవచ్చని సదరు వర్గాలు పసిగట్టాయి. ఇందుకు సంబంధించి ఇద్దరు, ముగ్గురు ఖలిస్థానీ మద్దతుదారులు.. పంజాబ్ నుంచి ఢిల్లీకి బయలుదేరినట్లు తెలుస్తోంది. దీని వెనక పాక్ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అయితే, ఇది కేవలం నిఘా వర్గాల ప్రాథమిక అంచనాలు మాత్రమేనని.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**జెడ్-ప్లస్ భద్రత**

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు జెడ్‌ప్లస్ భద్రత ఉంటుంది. పైలట్, ఎస్కార్ట్ టీమ్, తనిఖీ యూనిట్లతోసహా మొత్తం 63 మంది సిబ్బంది రక్షణగా ఉంటారు. అదనంగా 15 మంది సాయుధ బలగాలు (సీఏపీఎఫ్) కూడా కేజ్రీవాల్ భద్రతలో నిమగ్నమై ఉంటాయి. ఇలా 24గంటలూ కట్టుదిట్టమైన భద్రతలో ఉండే ఆయనపై దాడి ముప్పు ఉందంటూ వచ్చిన నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు.. భద్రతను సమీక్షించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇదిలాఉంటే, ఢిల్లీలో 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

## రాహుల్ వ్యాఖ్యలతో అసలు నిజం బయటపడింది

**- బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ఫైర్**



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ప్రతిపక్షం బీజేపీతో మాత్రమే కాదు.. దేశంతోనూ పోరాడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పలువురు కేంద్రమంత్రులు తప్పుబట్టారు. కాంగ్రెస్ అసలురూపం ఈ వ్యాఖ్యలతో బహిర్గతమైందని బీజేపీ జాతీయాధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. దేశంపై ప్రతిపక్షం పోరాడుతోందని చెబుతున్న రాహుల్ రాజ్యాంగాన్ని పట్టుకొని ఎందుకు తిరుగుతున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన విపక్ష నేత దేశంతో పోరాడుతున్నామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఆరెస్సెస్ వంటి మా భావజాలం వేల సంవత్సరాల నాటిది. బీజేపీ, ఆరెస్సెస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మేము ఇప్పుడు బీజేపీ , ఆరెస్సెస్‌తోపాటు భారత దేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు. రాహుల్ ప్రసంగంపై బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా స్పందిస్తూ ఇక దాపరికం లేదు.. కాంగ్రెస్ చేదు నిజం బయటపడిందని అన్నారు. దేశానికి తెలిసిన విషయాన్ని చెప్పినందుకు రాహుల్‌ను అభినందిస్తున్నానని వ్యాఖ్యానించారు. 'రాహుల్ గాంధీ, ఆయన చుట్టూ ఉన్నవారికి అర్బన్ నక్సల్స్‌తో సంబంధం ఉందనే విషయం అందరికీ తెలిసిందే. దేశం పరువు తీయాలని, కించపరచాలని, అప్రతిష్ఠపాలు చేయాలని వారు కోరుకుంటున్నారు. పదే పదే ఆయన చేస్తున్న పనులు ఈ నమ్మకానికి బలం చేకూర్చాయి. భారత్‌ను ముక్కలు చేసి, విభజించాలనే ఉద్దేశంతోనే ప్రతి ఒక్కటీ చేశారు.. చెప్పారు' అని ఎక్స్ వేదికగా నడ్డా మండి పడ్డారు.

# కైట్ ఫెస్టివల్‌లో సందడి



**విశ్వంభర, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ మంగళవారం, బుధ వారం రెండు రోజులు దేశ విదేశాల నుండి పలు ప్రాంతాల నుండి వచ్చిన వారు కైట్ ఫెస్టివల్ లో పతంగులు, విభిన్న అక్రులతో కూడిన వాటిని ఎగురవేస్తూ కనిపించారు.







## న్యూ ఢిల్లీ స్థానానికి నామినేషన్ వేసిన అరవింద్ కేజ్రీవాల్




**ఢిల్లీ:** వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 10న నోటిఫికేషన్ విడుదల కాగా.. 17వ తేదీ వరకు నామినేషన్‌లకు అవకాశం కల్పించారు. ఇక గడువు సమీపిస్తుండటంతో రాజధానిలో నామినేషన్‌లు జోరందుకున్నాయి. ఇప్పటికే కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఢిల్లీ సీఎం అతిశీ నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నామినేషన్ దాఖలు చేశారు. కేజ్రీవాల్ న్యూ ఢిల్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి కన్నాట్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రిటర్నింగ్ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్లి.. అక్కడ నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాగా ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

## ఢిల్లీలో మళ్లీ క్షీణించిన వాయు నాణ్యత

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఢిల్లీ వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వాయు నాణ్యత తీవ్రస్థాయికి పడిపోవడంతో కాలుష్య కట్టడి కోసం తక్షణమే కఠిన నిబంధనలు అమలు చేయాలని 'ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్' నిర్ణయించింది. ఈ క్రమంలోనే దేశ రాజధాని పరిధిలో మరోసారి 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్4 ఆంక్షలు విధించింది. స్థానికంగా వాయునాణ్యత సూచీ మంగళవారం 275గా ఉండగా.. బుధవారం సాయంత్రం 6 గంటలకు 396కు పెరిగింది. దట్టమైన పొగమంచు, కనిష్ఠ ఉష్ణోగ్రతల వంటి పరిస్థితుల కారణంగా గాలి నాణ్యత పడిపోయినట్లు తెలుస్తోంది.

**త్వరలోనే 400 దాటే అవకాశం**

స్థానికంగా ఏక్యూఐ త్వరలోనే 400 దాటే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. ఈ నేపథ్యంలోనే జీఆర్ఏపీ3, 4 ఆంక్షలు అమలు చేయాలని అధికార యంత్రాంగాన్ని సీఏక్యూఎం ఆదేశించింది. 'జీఆర్ఏపీ4' కింద నిర్మాణ సంబంధిత కార్యకలాపాలపై తాత్కాలిక నిషేధం, 10, 12 తరగతులు మినహా మిగతా విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు తదితర చర్యలు తీసుకుంటారు. ప్రతికూల వాతావరణం, వాహనాల ఉద్గారాలు, పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం, ఇతర కాలుష్య కారకాల కారణంగా ఏటా శీతాకాలంలో ఢిల్లీఎన్‌సీఆర్‌లో వాయునాణ్యత తీవ్రంగా ప్రభావితమవుతోంది.

## బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితా రిలీజ్

**40 మందితో బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితా**

**ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా సహా 40 మంది పేర్లు వెల్లడి**



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ ఎన్నికల ప్రచార బరిలోకి హేమాహేమీలను దింపుతోంది. పార్టీ స్టార్ క్యాంపెయినర్లుగా 40 మందితో కూడిన జాబితాను బుధవారంనాడు విడుదల చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్‌షా తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

**జాబితాలో పేర్లు ఇవే..**

కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్, నితిన్ గడ్కరి, మనోహర్‌లాల్ ఖట్టార్, ధర్మేంద్ర ప్రధాన్, సర్దార్ హర్దీప్ సింగ్ పురి, గిరిరాజ్ సింగ్, బీజేపీ రాష్ట్ర పాలిత ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, దేవేంద్ర ఫడ్నవిస్, హిమంత బిశ్వ శర్మ, మోహన్ యాదవ్, పుష్కర్ సింగ్ ధామి, భజన్‌లాల్ శర్మ, నయబ్ సింగ్ సైని ఈ జాబితాలో చోటుచేసుకున్నారు. ఇతర ప్రచారకర్తల్లో వీరేంద్ర సచ్‌దేవ, బైజయంత్ జే పాండ, అతుల్ గార్గ్, డాక్టర్ అక్లా గుర్జార్, హర్ష్ మల్హోత్రా, కేశవ్ ప్రసాద్ మౌర్య, ప్రేమ్ చంద్ బైర్వా, సమ్రాట్ చౌదరి, డాక్టర్ హర్షవర్ధన్, హన్స్ రాజ్ హన్స్, మనోజ్ తివారి, రామ్‌వీర్ సింగ్ బిధూడీ, యోగేంద్ర చాందోలియా, కమల్‌జీత్ షెరావత్, ప్రవీణ్ ఖండేల్వాల్, బన్సూరి స్వరాజ్, స్మృతి ఇరానీ, అనురాగ్ ఠాకూర్, హేమమాలిని, రవి కిషన్, దినేష్‌లాల్ యాదవ్, సర్దార్ రాజా ఇక్బాల్ సింగ్ ఉన్నారు.

## స్వాతంత్ర్యంపై భాగవత్ వ్యాఖ్యలు.. దేశద్రోహమే

**- రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు**



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. వీటిని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. భాగవత్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ చీఫ్‌పై ధ్వజమెత్తారు. ''దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకటి మా రాజ్యాంగ సిద్ధాంతం, మరొకటి ఆర్ఎస్ఎస్ భావజాలం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాలేదంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ దేశ ప్రజలందరినీ అవమానించారు. బ్రిటీష్ వారిపై పోరాడిన యోధులందరినీ ఆయన కించపరిచారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయి. ఇకనైనా ఇలాంటి పిచ్చి మాటలు వినడం ఆపాలి'' అని రాహుల్ అన్నారు.

# తిరుమలలో నకిలీ టికెట్ల కలకలం

- వెలుగులోకి రూ.300 ప్రత్యేక దర్శన నకిలీ టికెట్లు
- పోలీసుల అదుపులో ముగ్గురు



**విశ్వంభర, తిరుపతి:** శ్రీవారి నకిలీ దర్శన టికెట్ల వ్యవహారం తిరుమలలో మరోసారి కలకలం రేపింది. నకిలీ ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లతో భక్తులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం నకిలీ టికెట్లతో భక్తులకు శ్రీవారి దర్శనం చేయిస్తున్న కొందరిని టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారులు పట్టుకున్నారు. ట్యాక్సీ డ్రైవర్ల ద్వారా నకిలీ టికెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ముగ్గురు ఇంటి దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా నకిలీ టికెట్ల దందా..**

రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం కౌంటర్ ఉద్యోగి లక్ష్మీపతి.. అగ్నిమాపక శాఖ సిబ్బంది మణికంఠ, భానుప్రకాశ్‌లు ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా నకిలీ టికెట్ల దందా నిర్వహిస్తున్నారు. ట్యాక్సీ డ్రైవర్లు శశి, జగదీశ్‌తో కుమ్మక్కై.. స్వామివారి ఆదాయాన్ని అందినకాడికి దోచుకున్నారు. మణికంఠ సాయంతో లక్ష్మీపతి నకిలీ టికెట్లు తయారు చేస్తున్నట్లు టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారులు గుర్తించారు. లక్ష్మీపతి విధుల్లో ఉన్నప్పుడు నకిలీ టికెట్లతో భక్తులను దర్శనానికి పంపుతున్నట్లు తేల్చారు. అనుమానం వచ్చిన టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద కొందరు భక్తులను నిలిపివేశారు. భక్తుల వద్ద నుంచి నకిలీ టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. టీటీడీ సిబ్బంది ముగ్గురు కలిసి హైదరాబాద్, పొద్దుటూరు, బెంగళూర్ నుంచి వచ్చిన 11 మంది భక్తులకు టికెట్లు అమ్మి రూ.19 వేలు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఇంటి దొంగలతో పాటు ట్యాక్సీ డ్రైవర్లును అదుపులోకి తీసుకున్నారు. వారిపై తదుపరి చర్యలు తీసుకునేందుకు టీటీడీ అధికారులు సిద్ధమయ్యారు.

## బ్రాహ్మణికి లోకేశ్ అదిరిపోయే గిఫ్ట్



**విశ్వంభర, అమరావతి:** ఏపీ మంత్రి నారా లోకేశ్ తన సతీమణి బ్రాహ్మణికి సంక్రాంతి వేడుకల సందర్భంగా మంగళగిరిలో తయారు చేసిన చేనేత చీరను బహుమతిగా ఇచ్చారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇక్కడి చేనేత కార్మికుల నైపుణ్యం అద్భుతమైందని కొనియాడారు. ప్రతి ఒక్కరూ వారికి మద్దతిచ్చి చేనేతను ఆదుకునే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ పోస్టును నారా బ్రాహ్మణి రీపోస్టు చేశారు. మంగళగిరి చేనేత చీర చాలా ప్రత్యేకంగా ఉందని చెబుతూ లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గొప్ప నైపుణ్యంతో తీర్చిదిద్దిన చేనేత చీరను తీసుకోవడం సంతోషాన్నిచ్చిందని చెప్పారు.

## గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బిల్లులు సంక్రాంతి కానుకగా విడుదల

**మంత్రి నిమ్మల రామానాయుడు**

**విశ్వంభర, పాలకొల్లు:** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో రూ.75లక్షలతో నిర్మించిన రోడ్లు, గోకులం షెడ్డును మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిరైతులను ప్రోత్సహించేందుకు 'మినీ గోకులం' పునరుద్ధరించినట్టు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం పాడి పరిశ్రమకు తూట్లు పొడిచిందని విమర్శించారు. రూ.14లక్షల కోట్లు అప్పు ఉన్నా.. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బిల్లులను సంక్రాంతి కానుకగా చంద్రబాబు విడుదల చేశారని తెలిపారు. బకాయిల విడుదలతో ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని నిరూపించామన్నారు.

# పండగ పూట మరోసారి మంచు వివాదం

- తిరుపతికి మంచు ఫ్యామిలీ గొడవ
- శ్రీవిద్యానికేతన్ వద్ద ఉద్రిక్తత
- మనోజ్ రాకతో గేట్లు క్లోజ్..
- నోటీసులు జారీ చేసిన పోలీసులు
- రాళ్లు రువ్వుకున్న మనోజ్, విష్ణు అనుచరులు



**విశ్వంభర, తిరుపతి:** సీనియర్ నటుడు మోహన్‌బాబు కుటుంబంలో వివాదాలు మరో మలుపు తిరిగాయి. బుధవారం మోహన్‌బాబు కుమారుడు మంచు మనోజ్ తిరుపతిలో తన తండ్రికి చెందిన శ్రీ విద్యానికేతన్ స్కూల్ వద్దకు రావడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒకానొక దశలో మనోజ్, విష్ణు అనుచరులు ఒకరిపైఒకరు రాళ్లు రువ్వుకున్నారు. దీంతో మంచు ఫ్యామిలీ గొడవ తిరుపతికి చేరింది. మనోజ్ వస్తాడన్న సమాచారంతో మధ్యాహ్నం స్కూల్ గేట్లు మూసివేశారు. అక్కడకు సెక్యూరిటీ సిబ్బంది ఎవరిని అనుమతించలేదు. మీడియాను కూడా ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. అయితే మనోజ్ దంపతులు రేణిగుంట విమానాశ్రయం నుంచి రంగంపేటలోని ఉన్న విద్యాసంస్థల వద్దకు ర్యాలీగా రావడంతో ఉత్కంఠ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మంచు మనోజ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా లోపలకి అనుమతి లేదని పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. న్యాయస్థానంలో కేసు ఉన్న కారణంగా కాలేజీ ప్రాంగణంలోకి అనుమతి లేదని కోర్టు ఉత్తర్వులు మనోజ్‌కు పోలీసులు అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కాలేజీలోకి వెళ్లకుండానే మనోజ్ నారావారిపల్లెకు చేరుకున్నారు. అక్కడ మంత్రి నారా లోకేశ్‌తో మనోజ్ దంపతులు భేటీ అయ్యారు. లోకేశ్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి, తాను ఎదుర్కొన్న పరిస్థితులపై చర్చించనట్లు తెలిసింది. అనంతరం తిరిగి రంగంపేటలో జల్లికట్టు జరుగనున్న ప్రాంతానికి మనోజ్ వెళ్లారు.

**మనోజ్ మళ్లీ ఎంట్రీ..**

మంత్రి లోకేశ్‌ను కలిసిన అనంతరం మనోజ్, మౌనిక దంపతులు మళ్లీ రంగంపేటలోని విద్యానికేతన్ వద్దకు వచ్చారు. తాతయ్య నాయనమ్మ సమాధుల వద్దకు వెళ్లాలని సంకల్పించారు. అయితే మంచు మనోజ్ దంపతులను విద్యానికేతన్ ఆవరణలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారిద్దరూ గేటు బయటే నిలిచిపోయారు. కోర్టు ఆర్డర్ ఉందంటూ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మనోజ్ వారితో వాగ్వాదానికి దిగారు. ఈ క్యాంపస్ ఒకరిదే కాదని, తనను ఎందుకు వెళ్లవద్దంటున్నారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మనోజ్, విష్ణు అనుచరుల మధ్య కూడా వాగ్వాదం జరిగింది. ఇరువురి అనుచరులు పరస్పరం రాళ్లు విసురుకున్నారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. మోహన్‌బాబు బౌన్సర్లు, మనోజ్ బౌన్సర్లు కొట్టుకున్నారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ఉద్రిక్తతల మధ్య మరో మార్గంలో తాతయ్య నాయనమ్మ సమాధుల వద్దకు మనోజ్ దంపతులు వెళ్లారు. కాగా, మంచు మోహన్ బాబు యూనివర్సిటీలో అవతవకలు ఎత్తి చూపినందుకే తనపై కక్ష పెంచుకున్నారని నటుడు మంచు మనోజ్ తెలిపారు. తాను తాత, నానమ్మల, సోదరుడు ప్రసాద్‌ల సమాధుల వద్ద కూర్చుని కుటుంబంలో జరుగుతున్న సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుకుందామనుకున్నానని.. సాయిబాబా మీద ఒట్టు ఇలాంటివి జరుగకూడదని.. అయినా ఎందుకు జరుగుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. తాను తమ్ముడినే కదా? కూర్చొని మాట్లాడుకుందామని చెప్పినా అన్న, నాన్న వినడం లేదన్నారు. యూనివర్సిటీ కుటుంబంలో అందరిదని, వివాదం కోర్టులో ఉందని... పెద్దమనుషుల సమక్షంలో పరిష్కారానికి తాను సిద్ధంగా ఉన్నానని మనోజ్ స్పష్టం చేశారు.

# ఏపీలో జోరుగా కోడి పందాలు

- ఊరూవాడా బారులు.. కత్తులు దూసిన కోళ్లు
- చెలరేగిపోయిన కోడి పందెం రాయుళ్లు
- మూడోరోజు చేతులు మారిన లక్షలు
- బెట్టింగ్ రాయుళ్లను ఆకర్షించేలా ఖరీదైన బహుమతులు
- తెలంగాణ నుంచి వెళ్లిన రాజకీయ నేతలు
- పోటీల్లో పాల్గొని లక్షల్లో బెట్టింగ్



**రూ.300 కోట్ల వరకు..**

**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కోడి పందాలు మూడో రోజు జరిగాయి. పందాలకు బుధవారం వరకు అనుమతి ఉంది. పందాలకు అనుమతి లేదంటూ ప్రచారం జరిగింది. మూడు రోజులుగా సాగుతున్న కోడిపందాల్లో రూ.300 కోట్ల వరకు చేతులు మారినట్లు సమాచారం. కోడిపందాల ముసుగులో యధేచ్ఛగా పేకాట, గుండాట జరిగాయి. ప్రతీ కోడి పందెం శిబిరం వద్ద మద్యం బెల్ట్ షాపులు కూడా వెలిశాయి.**

**విశ్వంభర, రాజమండ్రి:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కోడిపందాలు, గుండాట జోరుగా కొనసాగాయి. కనుమ పండుగ రోజు పందాలు జోరుగా సాగాయి. కోడిపందాల శిబిరాల్లో లక్షల్లో బెట్టింగ్‌లు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లాలో హోరాహోరీగా కోడిపందాలు జరుగగా, జిల్లాలో సుమారు 100 నుంచి 120 గ్రామాల్లో 300కు పైగా బరులు ఏర్పాటు చేశారు. భోగి, సంక్రాంతి రెండు రోజుల్లో ఒక్కో బరిలో సగటున 20 లక్షల వరకు పందాలు, గుండాట జరిగినట్లు అంచనా వేస్తున్నారు. జిల్లాలో సుమారు రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకూ పందాలు, జూదం జరిగినట్లు సమాచారం. చాలా చోట్ల వీఐపీ పాసులు, సాధారణ పాసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 200కి పైగా బరులు ఏర్పాటు చేశారు. మురమళ్లలో వీఐపీలో బరి రూ.60 కోట్ల నుంచి రూ.120 కోట్ల వరకు పందాలు జరిగినట్లు అంచనా. కొన్ని చోట్ల విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఆత్రేయపురంలో విజేతలకు బుల్లెట్లను బహుమతులు అందజేశారు.

**సాంప్రదాయం ముసుగులో..**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో సాంప్రదాయ ముసుగులో భారీఎత్తున జూద క్రీడలు కొనసాగాయి. ఇబ్రహీంపట్నం టెర్మినల్‌లో జూద క్రీడలు క్యాసినోను తలపించాయి. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్ గ్రూప్ సంస్థ జూద క్రీడలు నిర్వహిస్తోంది. బౌన్సర్‌లను పెట్టి మరీ ఆర్‌ఆర్ గ్రూప్ సంస్థ పేకాట శిబిరాలను ఏర్పాటు చేసింది. ఆ సంస్థ ఇబ్రహీంపట్నానికి హైదరాబాద్ కల్చర్‌ను పరిచయం చేసింది. ఇంత జరుగుతున్నప్పటికే ఇబ్రహీంపట్నం పోలీసులు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి. భారీ ఎత్తున ముడుపులు చెల్లింపులు జరిగినట్లు సమాచారం.

**1.25 కోట్లు గెలిచిన కోడిపుంజు!**

కోడి పందాలకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. పందెంలో నిలిచిన నాలుగు పుంజుల్లో ఒకటి ఎటు కదలకుండా ప్రత్యర్థి కోళ్లపై దాడి చేయకుండా నిలబడి ఏకంగా 1.25 కోట్లు గెలుచుకుంది. ఆ వీడియోలో గ్రూప్ కోడి పందాల్లో భాగంగా నాలుగు పుంజులను ఒకేసారి బరిలో ఉంచారు. దీంతో ఓ మూడు కోళ్లు మాత్రం భీకరంగా ఫైట్ చేయగా, ఒక కోడి మాత్రం ఎటు కదలకుండా అక్కడే ఉండిపోయింది. మరో పక్కన మూడు కోళ్లు తీవ్రగాయాలతో ఒక్కొక్కటిగా కింద పడిపోయాయి. దీంతో చివరికి ఎటు కదలకుండా నిల్చున్న కోడి విజయం సాధించి 1.25 కోట్లు గెలుచుకొని తనపై బెట్ పెట్టినవారికి కాసుల పంట పండించింది. దీంతో ఆ కోడిపై సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలవ్వగా, మెజారిటీ నెటిజన్లు.. 'గొడవలు జరిగినప్పుడు ఏం చేయకపోవడమే ఉత్తమమైన మార్గం అనడానికి ఇదు నిదర్శనం' అని రాసుకొచ్చారు. మరికొందరు ఫైస్టార్ చాక్లెట్ యాడ్‌ను గుర్తు చేశారు.

# హైదరాబాద్‌కు ఏపీ వాసుల తిరుగు ప్రయాణం

- టోల్‌గేట్ల వద్ద భారీగా వాహనాల రద్దీ
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసుల చర్యలు
- నేడు మరింత రద్దీ ఉంటుందని అంచనా



**విశ్వంభర, హైదరాబాద్:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు మళ్లీ పట్నం బాట పట్టారు. ఉత్సాహంగా గతవారం ఊళ్లకు బయలుదేరిన పల్లెవాసులు, సంక్రాంతిని ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో జరుపుకుని తమ ఉద్యోగాల రిత్యా తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ క్రమంగా పెరిగింది. నల్గొండ జిల్లాలోని చౌటుప్పల్ దగ్గర పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. రద్దీ పెరుగుతుండటంతో 12 టోల్ బూత్‌ల ద్వారా ఏపీ నుంచి తెలంగాణకు వాహనాలను హైదరాబాద్ వైపుగా పంపుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేశారు. నేడు రద్దీ తీవ్రంగా ఉంటుందని అక్కడి ట్రాఫిక్ పోలీసులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రాంతాలకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు 116 అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదనపు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని.. సాధారణ ఛార్జీలే వసూల చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది.

# ఓర్వలేకే వైసీపీ నేతల దుష్ప్రచారం

**రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**విశ్వంభర, అమరావతి:** ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పినా వైసీపీ నేతల తీరు ఏమాత్రం మారడం లేదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సంక్రాంతి కళ లేదంటూ వైకాపా నేతలు చేస్తున్న దుష్ప్రచారం దుర్మార్గమని మండిపడ్డారు. వైకాపా నాయకులు.. అసత్య ప్రచారాలకు పండుగలను కూడా వదలడం లేదని అసహనం వ్యక్తం చేశారు. మునుపెన్నడూ లేని విధంగా పొరుగు రాష్ట్రాలు, దేశవిదేశాల్లో స్థిరపడిన తెలుగువారు ఈ సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చారని మంత్రి స్పష్టం చేశారు. గతేడాది గుంతల రహదారులతో ఇబ్బంది పడ్డవారంతా ఈసారి సాఫీగా ప్రయాణించి స్వగ్రామాలకు చేరుకున్నారన్నారు. ''కూటమి ప్రభుత్వం దాదాపు రూ.850 కోట్లతో గత ఆరు నెలల్లో రహదారులను బాగు చేయించింది. సమగ్ర నీటి వినియోగంతో ఈసారి పంటలు కూడా బాగా పండాయి. పెండింగ్ బకాయిలతో పాటు 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించటంతో రైతులు సంతోషంతో పండుగ చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం వివిధ వర్గాలకు పెండింగ్‌లో పెట్టిన రూ.6,700 కోట్ల బకాయిల విడుదలకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలపడంతో సంతోషంగా పండుగ జరుపుకొంటున్నారు. ప్రజల సంతోషాన్ని చూసి ఓర్వలేక వైకాపా నేతలు దుష్ప్రచారం మొదలుపెట్టారు. ప్రజలు సంతోషంగా ఉండేలా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం'' అని మంత్రి తెలిపారు.

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి నోటీసులు

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కరీంనగర్ కోర్టుకు హాజరుకావాల్సి ఉందని, విచారణకు ఈనెల 17న హాజరవుతానని కౌశిక్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులు అడ్డుకోవడం, బెదిరింపుల వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఫిర్యాదు మేరకు గతంలో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌ను దర్యాప్తు అధికారిగా డీసీపీ విజయ్‌కుమార్ నియమించారు.

# అక్రమంగా చైనా మాంజా విక్రయాలు

- వాహనదారులకు శాపం మారిన వైనం
- ఏటా వందలాది మంది బలి
- వేలాది పక్షులు మృత్యువాత
- నగరంలో పదికి పైగా కేసులు
- పాతబస్తీలో భారీగా పట్టివేత



**విశ్వంభర, హైదరాబాద్:** చైనా మాంజా ఎంత సులువుగా ఇతరుల పతంగులను తెంపేస్తుందో అంతే ఈజీగా మనుషుల మెడలు, చేతులకు గాయాలు చేస్తాయి. ఈ మాంజా కారణంగా మరణాలు సంభవించిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. సంక్రాంతి పండుగ అంటే గాలిపటాలు అని ఎంత సంబురపడిపోతారో వాటిని ఎగురవేయడానికి వినియోగించే మాంజా కారణంగా కుటుంబాల్లో విషాదాన్ని మిగుల్చుతోంది. కొంతమంది ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు తీవ్ర గాయాలపాలవుతున్నారు. ప్రభుత్వం నిషేధించినా, పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేసినా కొందరిలో మార్పు రావడం లేదు. ఇటీవల పాతబస్తీలో పోలీసులు దాదాపు రూ.2 కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు.

**యువకుడి గొంతు కోసిన మాంజా..**

మంగళవారం మాంజా దారి చుట్టుకొని రాష్ట్రంలో ఇద్దరు గాయపడ్డారు. సంగారెడ్డి జిల్లా కర్దనూరు రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తికి చైనా మాంజా తగిలి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితుని వెంటనే ఆసుపత్రికి తరలించారు. వికారాబాద్కు చెందిన వెంకటేశ్ బంధువులతో కలిసి ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి జిల్లా కర్దనూరు రహదారి మీదుగా శంకరపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో గాలిపటం కోసం కట్టిన చైనా మాంజా అతని గొంతుకు తగిలి కోసుకుపోయింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చూసి వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని పటాన్చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రామవరంలో చైనా మాంజా ఉపయోగంతో తీవ్ర ప్రమాదం జరిగింది. పతంగి ఎగరేసేందుకు వాడిన నిషేధిత చైనా మాంజా ద్విచక్ర వాహనదారుడి మెడకు చుట్టుకుంది. దీంతో అతడి మెడకు తీవ్రంగా గాయమైంది. ఘటనలో రక్తస్రావం అధికంగా కావడంతో పరిస్థితి విషమంగా మారింది. స్థానికులు అతడిని కొత్తగూడెంలోని ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తర్వాత హైదరాబాద్‌కి తరలించారు. యాదగిరిగుట్టలో చైనా మాంజా తగిలి వృద్ధ దంపతులు బైకు నుంచి కింద పడ్డారు. బాధితులకు గాయాలు కాగా, స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఇక, నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండల కేంద్రంలో ఓ యువకుడికి చైనా మాంజా చుట్టుకోవడంతో తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన అద్నాన్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చైనా మాంజా చుట్టుకోవడంతో మెడ, కాలుకు, చేతివేలికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.

**నగరంలో టెకీకి గాయాలు..**

నగరంలో నిషేధిత చైనా మాంజా తగిలి మరొకరికి గాయాలయ్యాయి. ఉప్పల్ డీఎస్ఎల్ కంపెనీ భవనంలోని బైక్‌పై వెళ్తుండగా ఘటన జరిగింది. మాంజా దారం తగిలి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయివర్ధన్‌రెడ్డి కింద పడిపోయారు. దీంతో అతడి మెడకు గాయమైంది. గాయాలపాలైన ఆయనను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ మీరట్‌లో బైక్‌పై వెళ్తున్న 21 ఏళ్ల యువకుడి సుహైల్ మాంజా దారం కారణంగా మృతిచెందాడు. రోడ్డుపై పడి ఉన్న మాంజా బైక్‌పై వెళ్తుండగా గొంతును కోసింది. రెండు చెట్ల మధ్య ఉన్న మాంజా దారం గొంతు సగానికి పైగా కోసింది. దీంతో సుహైల్ బైక్ బోల్తా పడింది. వెనకాల కూర్చున్న సుహైల్ స్నేహితుడు నవాజీష్‌కి కూడా గాయాలయ్యాయి. దారం అతడి ముక్కుని కోసింది. ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సుహైల్ మృతిచెందాడు.

**ఇక్కడే తయారు చేస్తున్నారు : సీపీ ఆనంద్**

వాస్తవానికి చైనా మాంజా దిగుమతి కావడం లేదని, స్థానికంగానే తయారు చేస్తున్నారని సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చైనీస్ మాంజాను స్థానికంగా తయారు చేయడం వల్లే మార్కెట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. బహిరంగ మార్కెట్‌లో దొరికేది కొంతైతే, గుట్టుచప్పుడు కాకుండా స్థానికంగా తయారు చేసి ఈ-కామర్స్ సైట్స్‌లో అమ్మకాలు చేయడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈ విషయంపై త్వరలో ఈ-కామర్స్ సైట్స్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కామర్స్ గోదాములపై కూడా దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి చైనీస్ మాంజా వాడకాన్ని అరికట్టాలన్నారు. చైనీస్ మాంజా కారణంగా ఇప్పటికే నగరంలో పదికి పైగా కేసులు నమోదయ్యాయి.

## పాకిస్థాన్ వెళ్లనున్న టీమిండియా

# కెప్టెన్ రోహిత్ శర్మ!

- ఛాంపియన్స్ ట్రోఫీ ఆరంభ వేడుకల్లో పాల్గొననున్న భారత సారథి!
- ఐసీసీ ప్రామాణిక పద్ధతుల ప్రకారం హాజరుకానున్న అన్ని జట్ల కెప్టెన్లు
- ఫిబ్రవరి 16 లేదా 17న ప్రారంభ వేడుకలకు గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్న పీసీబీ



**క్రిడావిభాగం:** దాదాపు ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ అభిమానులను అలరించబోతోంది. ఫిబ్రవరి 19 నుంచి ఈ మెగా టోర్నీ షురూ కానుంది. భారత్ మ్యాచ్‌లన్నీ తటస్థ వేదికైన దుబాయ్‌లోనే జరగనున్నాయి. అయితే, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఒక్కడు మాత్రం ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొనేందుకు ఆతిథ్య దేశం పాకిస్థాన్ వెళ్లే అవకాశాలు ఉన్నాయి. దాదాపు 29 సంవత్సరాల తర్వాత ఐసీసీ ఈవెంట్‌కు ఆతిథ్యం ఇస్తుండడంతో ఆరంభ వేడుకలను గ్రాండ్ నిర్వహించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్ణయించిందని, ఫిబ్రవరి 16 లేదా 17న ప్రారంభోత్సవ వేడుకలు ఉండవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌కు అనుగుణంగా ఓపెనింగ్ సెర్మనీ తేదీ ఖరారవుతుందని తెలిపాయి. ఐసీసీ ప్రామాణిక పద్ధతుల ప్రకారం టోర్నీలో పాల్గొనే అన్ని జట్ల కెప్టెన్లు ప్రారంభ వేడుకలో పాల్గొనాల్సి ఉంటుంది. అందులో భాగంగానే రోహిత్ పాకిస్థాన్ వెళ్లనున్నాడని జాతీయ మీడియా పేర్కొంది.

కాగా, 1996 క్రికెట్ ప్రపంచ కప్‌ను భారత్, శ్రీలంకతో కలిసి పాకిస్థాన్ ఉమ్మడిగా ఆతిథ్యం ఇచ్చింది. ఆ దేశంలో జరిగిన ఐసీసీ తొలి ప్రధాన ఈవెంట్ అదే. ఆ తర్వాత ఒక్క ఐసీసీ ఈవెంట్ కూడా ఆతిథ్యం ఇవ్వలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భారత్ ఆడే మ్యాచ్‌లు, తొలి సెమీ-ఫైనల్ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. భారత్ అర్హత సాధిస్తే ఫైనల్ మ్యాచ్ కూడా దుబాయ్ వేదికగానే జరగనుంది. ఇండియా తుది పోరుకు చేరుకోకుంటే లాహోర్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లు పాల్గొననున్నాయి. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఫిబ్రవరి 23న దుబాయ్ వేదికగా జరగనుంది.

## ఫెదరర్ ఆల్‌టైమ్ రికార్డ్ బ్రేక్ చేసిన జకోవిచ్

**క్రిడావిభాగం:** సెర్బియా ఆటగాడు నొవాక్ జకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడో రౌండ్‌కు చేరుకొన్నాడు. రెండో రౌండ్‌లో పోర్చుగల్ ఆటగాడు జైమీ ఫరియాపై 6-1, 6-7 (4), 6-3, 6-2 తేడాతో జకోవిచ్ విజయం సాధించాడు. ఈక్రమంలో ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అద్భుతమైన ఘనత సాధించాడు. ఇప్పటివరకు టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ పేరిట ఉన్న అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రికార్డును జకోవిచ్ బద్దలు కొట్టాడు. ఫెదరర్ 429 ఆడగా.. జకోవిచ్ 430 మ్యాచ్‌లు పూర్తి చేసుకొన్నాడు. ఇప్పటివరకు జకోవిచ్ 24 గ్రాండ్‌స్లామ్‌లను సాధించాడు. ఇందులో 10 ఆస్ట్రేలియన్ ఓపెన్, 3 ఫ్రెంచ్ ఓపెన్, 7 వింబుల్డన్, 4 యూఎస్ ఓపెన్‌లు ఉన్నాయి. ''టెన్నిస్ ఆడటాన్ని ప్రేమిస్తా. పోటీని మరింత ఆస్వాదిస్తా. ప్రతిసారీ వందశాతం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నిస్తా. గత 20 ఏళ్లుగా గ్రాండ్‌స్లామ్‌ను గెలుచుకొనేందుకు కష్టపడ్డా. గెలిచినా.. ఓడినా మనస్ఫూర్తిగా ఆడేందుకు ప్రయత్నించా. గ్రాండ్‌స్లామ్‌లను గెలవడం ఎప్పుడూ అద్భుతంగానే ఉంటుంది. టెన్నిస్‌కు అవే పిల్లర్లు. నేను తొలిసారి వింబుల్డన్ ఫైనల్ మ్యాచ్‌ను చూసినట్లు గుర్తు. 'ఓపెన్ ఎరా' ప్రొఫెషనల్ టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లను నెగ్గిన ప్లేయర్‌గా ఉండటం గర్వంగా ఉంది. ఇప్పుడు మరో అద్భుతమైన రికార్డును సాధించా'' అని జకోవిచ్ వెల్లడించాడు. కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన జకోవిచ్ మూడో రౌండ్‌లో థామస్ మచాక్‌తో తలపడనున్నాడు.






## 304 పరుగుల తేడాతో టీమిండియా

# అద్భుత విజయం

- రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్, భారత్ మధ్య మూడో వన్డే
- 50 ఓవర్లలో 435 రన్స్ చేసిన భారత మహిళా జట్టు
- 130 పరుగులకే ఆలౌట్ అయిన ఐర్లాండ్ టీమ్
- శతక్కొట్టిన ప్రతీకా రావల్ (154), స్మృతి మంధాన (135)
- మూడు మ్యాచుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా



**రాజ్‌కోట్:**

ఐర్లాండ్ మహిళల జట్టుతో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో భారత మహిళల జట్టు అద్భుతం చేసింది. ఐర్లాండ్‌ను భారీ తేడాతో ఓడించి వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఏకంగా 304 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. పరుగుల పరంగా చూసుకుంటే టీమిండియా అత్యధిక తేడాతో విజయం సాధించిన మ్యాచ్ ఇదే కావడం విశేషం. అంతకుముందు ఐర్లాండ్‌పైనే 2017లో ఏకంగా 249 పరుగుల తేడాతో భారత్ విజయాన్ని అందుకుంది. 436 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ జట్టు.. 31.4 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలిపోయింది. సారా (41), ఓర్లా (36) మాత్రం కాస్త రాణించారు. టీమిండియా బౌలర్లలో తనూజా 2, దీప్తి 3, సయాలీ 1, సాధు 1, మిన్ను మని 1 వికెట్.

అంతకుముందు మొదట బ్యాటింగ్ కు దిగిన టీమిండియా 435/5 రికార్డు స్కోరు చేసింది. ప్రతికా రావల్ (154), స్మృతీ మంధాన (135) సెంచరీలతో అద్భుత ప్రదర్శన చేశారు.

**ఛేదనలో మ్యాచ్ సాగిందిలా..**

మూడో వన్డేలో ఏ దశలోనూ కోలుకోనివ్వలేదు భారత బౌలర్లు. 436 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన ఐర్లాండ్ ను స్వల్ప వ్యవధిలోనే వికెట్లను కోల్పోయేలా చేశారు. కెప్టెన్ గాబీ లూయిస్ (1), కౌల్టర్ (0) మరీ దారుణంగా విఫలమయ్యారు. మరో ఓపెనర్ సారా ఫోర్బ్స్ కాసేపు నిలకడ ప్రదర్శన చేసింది. ఓర్లా (36)తో కలిసి మూడో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసింది. లారా డెలానీ (10), లేహ్ పాల్ (15), కెల్లీ (2) అంతా చేతులెత్తేశారు.

**స్మృతి, ప్రతీక అద్భుత సెంచరీలు - టీమిండియా భారీ స్కోర్**

మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియాలో ఓపెనర్లు స్మృతి మంధాన (135), ప్రతీకా రావల్ (154) ఆది నుంచే దూకుడుగా ఆడి సెంచరీలు నమోదు చేశారు. మొదటి వికెట్‌కు 233 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో వన్డేల్లో టీమిండియా తరఫున వేగవంతమైన (70 బంతుల్లో) శతకాన్ని బాదింది స్మృతి. మంధాన ఔట్ అవ్వగానే రిచా ఘోష్ (59)తో కలిసి స్కోరును ముందుతీసుకెళ్లింది ప్రతీకా. అనంతరం రిచా కూడా పెవిలియన్ చేరాక తేజల్ (28), హర్లీన్ (15)తో కలిసి ప్రతీకా పరుగులు చేసింది. దీంతో వన్డే చరిత్రలో టీమిండియా తొలిసారి 400+ స్కోరును దాటింది. 435 పరుగులు చేసింది. ఐర్లాండ్ బౌలర్లలో ఓర్లా 2 వికెట్లు పడగొట్టగా, కెల్లీ, ఫ్రేయా, డెంప్సీ తలో వికెట్ దక్కించుకున్నారు. ఇక ఈ విజయంతో టీమిండియా మూడు మ్యాచుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' రెండు కూడా ప్రతీకా రావల్‌కే దక్కాయి.



### 70 బంతుల్లో 100 పరుగులు స్మృతి ఫాస్టెస్ట్ సెంచరీ

**రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్‌తో జరుగుతోన్న మూడో వన్డేలో టీమ్‌ఇండియా కెప్టెన్ స్మృతి మంధాన సెంచరీతో చెలరేగిపోయింది. 70 బంతుల్లో 100 పరుగులు సాధించి అత్యంత వేగంగా శతకం బాదిన మహిళా క్రికెటర్‌గా చరిత్రకెక్కింది. ఇంతకుముందు ఈ రికార్డు హర్మన్ ప్రీత్ సింగ్ (87 బంతులు) పేరిట ఉండగా, ఇప్పుడు ఆ తర్వాతి స్థానాన్ని సొంతం చేసుకుంది. అయితే రెండో వన్డేలోనూ ఆమె శతకం చేసింది.**

**ఇక ఈ మ్యాచ్‌లో స్మృతి 135 పరుగులు చేసి ఔట్ అయ్యింది. మొత్తం 80 బంతుల్లో 135 పరుగులు చేసి వెనుతిరిగింది. అయితే సెంచరీ తర్వాత మరో 10 బంతుల్లోనే 35 పరుగులు స్కోర్ చేయడం విశేషం. అయితే తొలి వికెట్‌కు ప్రతీక రావల్‌తో కలిసి స్మృతి 233 పరుగుల భాగస్వామ్యాన్ని అందించి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించింది.**

## రోహిత్, విరాట్ చూపు రంజీ వైపు

**క్రిడావిభాగం :** టీమ్‌ఇండియా బ్యాటింగ్ ప్రదర్శన గత రెండు టెస్టు సిరీస్‌ల్లో ఆశించిన స్థాయిలో లేదు. స్వదే శంలో న్యూజిలాండ్, రీసెంట్ గా ఆస్ట్రేలియా పర్యటలో భారత్ బ్యాటింగ్ ప్రదర్శన పట్ల మేనేజ్‌మెంట్ అసంతృప్తిగా ఉంది. దీంతో ప్లేయర్లంతా డొమెస్టిక్ టోర్నీల్లో ఆడాల్సిందేనని, ఇందులో ఎవరికీ మి నహాయింపు లేదని గట్టిగా చెబుతోంది. ఈ క్రమంలోనే జనవరి 23నుంచి ప్రారంభం కానున్న గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌ల్లో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సహా యువ ఆటగాళ్లు సైతం రంజీ బరిలో దిగనున్నారు.

రోహిత్ రెడీ..! కొంతకాలంగా పేలవ ఫామ్ తో ఇబ్బంది పడుతున్న రోహిత్ శర్మ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ముంబయి తరఫున బరి లో దిగేందుకు రెడీ అవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే నెట్స్‌లో ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో రోహిత్ దేశవాళీలో దిగడం ఖాయంగానే క నిపిస్తోంది. కాగా, 2015లో రోహిత్ ఆఖరిసారిగా రంజీలో ఆడాడు.

విరాట్ డౌటే..! బ్యాటింగ్‌లో విరాట్‌ది కూడా అదే పరిస్థితి. ఇదివరకులా విరాట్ బ్యాట్ నుంచి పరుగులు రావడం లేదు. అందుకే విరాట్‌ను కూడా రంజీ బరిలో దిగాల్సిందేనని మేనేజ్‌మెంట్ ఆదేశించినట్లు సమాచారం. మరి కోహ్లీ డొమెస్టిక్ ఆడతాడా? అనేది డౌట్ గానే ఉంది. కానీ, దిల్లీ జట్టు మాత్రం ప్రాబబుల్స్‌లో విరాట్‌కు చోటు ఇచ్చింది. దీంతో కోహ్లీ కూ డా దేశ వాళీలో ఆడతాడని క్రీడా వర్గాల సమాచారం. విరాట్ రంజీ బరిలో దిగుతాడా? లేదా! చూడాలి.



**పంత్ ఓకే :** 2025 రంజీకి అందుబాటులో ఉంటానని యంగ్ బ్యాటర్ రిషబ్ పంత్ ఇప్పటికే దిల్లీ మేజేన్‌మెంట్‌కు సమాచారం అందించాడట. దీంతో పంత్ బరిలో దిగడం ఖాయంగానే కనిపిస్తుంది. 2016-17లో పంత్ చివరిసారిగా రంజీ క్రికెట్ ఆడాడు. ఆసీస్ టెస్టు సిరీస్‌లో విఫలమైన పంత, రంజీలో ఆడి కమ్ బ్యాక్ ఇవ్వాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

**గిల్ క్లియర్ :** టీమ్‌ఇండియాలో పేలవ ఫామ్ లో ఉన్న బ్యాటర్లలో శుభ్ మన్ గిల్ కూడా ఒకడు. ఈ యంగ్ బ్యాటర్ కొంతకాలంగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. అయితే వయసురీత్యా గిల్‌కు ఎంతో భవిష్యత్ ఉంది. ఈ క్రమం లో కమ్‌బ్యాక్ ఇవ్వడానికి గిల్‌కు రంజీ మ్యాచ్‌లు ఎంతో ఉపయోగపడతాయి. దీంతో గిల్ మళ్లీ రంజీ బాట పట్టాడు. అతడు పంజాబ్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

**జైస్వా ల్ సెన్సేషనల్ :** టీమ్‌ఇండియాలో అరంగేట్రం చేసినప్పటి నుంచి యశస్వీ జైస్వాల్ సంచలనంగా మారాడు. టీ20, టెస్టు ఫార్మాట్లలో నిలకడగా రాణిస్తూ, జట్టులో కీలక ప్లేయర్ గా ఎదిగాడు. ప్రస్తుతం జైస్వాల్ మంచి ఫామ్ లో ఉన్నప్పటికీ బీసీసీఐ నిబంధన మేరకు డొమెస్టిక్ ఆడనున్నాడు. ముంబయి తరఫున జైస్వాల్ బరిలో దిగనున్నాడు. వీరితోపాటు యంగ్ ప్లేయర్లు నితీశ్ కుమార్ రెడ్డి, ఆకాశ్ దీప్ తదితరులు కూడా రంజీలో కనిపించనున్నారు.

## ఇంగ్లాండ్ సిరీస్ ముందు

# విజయ్ దేవరకొండ సర్‌ప్రైజ్!

**క్రిడావిభాగం :** టీమిండియా యంగ్ ప్లేయర్, తెలుగు కుర్రాడు తిలక్ వర్మ.. టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండను అనుకోకుండా విమానంలో కలుసుకున్నాడు. దీంతో విజయ్ దేవరకొండ, తిలక్ వర్మ కలిసి ఓ ఫోటో దిగారు. ఈ విషయాన్ని తిలక్ స్వయంగా తన సోషల్ మీడియాలో తెలియజేస్తూ విజయ్‌తో కలిసి దిగిన ఫోటోను పోస్ట్ చేశాడు. విజయ్ ను అనుకోకుండా కలవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పిన తిలక్, హీరోను సడెన్ గా చూసి షాక్ అయినట్లు తెలిపాడు.

'అన్నా.. నిన్ను విమానంలో అనుకోకుండా కలవడం ఎంతో ఆశ్చర్యానికి గురి చేసింది. నిన్ను కలవడం గొప్పగా ఉంది.' అని ఇన్‌స్టా స్టోరీస్‌లో విజయ్‌తో దిగిన ఫోటోను షేర్ చేస్తూ తిలక్ వర్మ రాసుకొచ్చాడు. ప్రస్తుతం వీరిద్దరు కలిసి దిగిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాగా, టీమిండియా జనవరి 22 నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచుల టీ20 సిరీస్ లో తలపడనుంది. ఈ సిరీస్‌కు తిలక్ వర్మ సెలక్ట్ అయ్యాడు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారత జట్టు బరిలోకి దిగనుంది.

ఇకపోతే గత నవంబర్‌లో జరిగిన సౌతాఫ్రికా పర్యటనలో తిలక్ వర్మ అద్భుత ప్రదర్శన చేశాడు. నాలుగు మ్యాచుల టీ20 సిరీస్‌ను టీమిండియా 3-1 తేడాతో దక్కించుకోవడంతో తిలక వర్మ కీలకంగా వ్యవహరించాడు. అతడు చివరి రెండు టీ20ల్లోనూ సెంచరీలు బాది ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే టీ20ల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నాడు.





**ఇంగ్లాండ్ పర్యటకు టీమిండియా స్క్వాడ్ ..**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, రింకూ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, మహ్మద్ షమీ, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ , ధృవ్ జురెల్ (వికెట్ కీపర్).

**సిరీస్ షెడ్యూల్ ..**

జనవరి 22న కోల్‌కతా వేదికగా తొలి టీ20 మ్యాచ్, జనవరి 25న చెన్నై వేదికగా రెండో టీ20 మ్యాచ్, జనవరి 28న రాజ్‌కోట్ వేదికగా మూడో టీ20 మ్యాచ్, జనవరి 31న - పుణె వేదికగా నాలుగో టీ20 మ్యాచ్, ఫిబ్రవరి 2న - ముంబయి వేదికగా ఐదో టీ20 మ్యాచ్.మొత్తంగా కెరీర్ లో తిలక్ వర్మ ఇప్పటి వరకు టీమిండియా తరుపున నాలుగు వన్డేలు, 20 టీ20లకు ప్రాతినిధ్యం వహించాడు. 4 వన్డేల్లో 22.7 యావరేజ్ తో 68 పరుగులు సాధించాడు. 20 టీ20ల్లో 51.3 యావరేజ్ తో 616 రన్స్ సాధించాడు. వీటిలో రెండు శతకాలు, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. 38 ఐపీఎల్ మ్యాచుల్లో 39.9 యావరేజ్ తో ఆరు అర్ధ శతకాల సాయంతో 1156 పరుగులు సాధించాడు.



# అన్నపూర్ణ స్టూడియోస్ @ 50 ఏళ్లు



అక్కినేని నాగేశ్వరరావు గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన నటనతో ప్రేక్షకులను ఎంతగా మెప్పించారో.. ఇండస్ట్రీ కోసం ఎన్నో సేవలు కూడా అందించారు. అప్పట్లో స్టూడియోస్ కోసం మద్రాస్ వెళ్లాల్సివస్తుందని.. ఆయనే సొంతంగా హైదరాబాద్ లో ఒక స్టూడియోను నిర్మించారు. అదే అన్నపూర్ణ స్టూడియోస్. టాలీవుడ్ లో మొట్టమొదటి స్టూడియోను నిర్మించిన ఘనత వెంకయ్య నాయుడుకు దక్కింది. ఇక ఆయన స్ఫూర్తిగా ఏఎన్నార్ .. అన్నపూర్ణ స్టూడియోస్ పేరుతో స్టూడియోను నిర్మించారు. ఇప్పుడు తెలుగులోనే కాదు ..దేశంలోనే టాప్ 10 స్టూడియోస్ లో అన్నపూర్ణ స్టూడియోస్ ఒకటి. ఇక ఈ సంక్రాంతికి ఈ స్టూడియో నిర్మించి 50 ఏళ్లు పూర్తయ్యాయి. 1975 ఆగస్టు 14 న అన్నపూర్ణ స్టూడియోస్ కి పునాది రాయి పడింది. అన్నపూర్ణ స్టూడియోస్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు అయిన సందర్భంగా అక్కినేని నాగార్జున ప్రత్యేక వీడియో విడుదల చేశారు. 50 ఏళ్ల క్రితం రఘుపతి సంక్రాంతి పండుగరోజు ఈ స్టూడియో ఓపెన్ అయినట్లు చెప్పారు. అప్పటి నుంచి ప్రతి సంక్రాంతికి ఇక్కడకు వచ్చి అందరితో పాటు టిఫెన్ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

# రాజకీయాల్లోకి వరలక్ష్మి!

సినీ రంగాన్ని, రాజకీయ రంగాన్ని వేరుచేసి చూడలేం. నటులే కాదు.. నటీమణులు కూడా రాజకీయ రంగప్రవేశానికి సై అంటున్నారు. ఈ మధ్య నటి త్రిష ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన విషయం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలైంది. తాజాగా, మరో హీరోయిన్ పొలిటికల్ ఎంట్రీకి సిద్ధమంటోంది. ఆ నటి మరెవరో కాదు వరలక్ష్మి శరత్ కుమార్. ఆమె హీరోయిన్ గా వచ్చిన లేటెస్ట్ మూవీ మదగజరాజు. విశాల్ హీరోగా వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయం సాధించింది. ఈ ప్రమోషన్స్ లో భాగంగా మాట్లాడిన వరలక్ష్మి "నేను రాజకీయాల్లోకి వస్తాను. కానీ దానికి చాలా టైం ఉంది. రాజకీయాల్లో నాకు దివంగత జయలలిత గారే స్ఫూర్తి" అంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ కామెంట్స్ ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి.






# ఆకట్టుకుంటున్న 'మిరాయ్' పోస్టర్

'హనుమాన్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న యంగ్ హీరో తేజా సజ్జా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టిజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన గ్లింప్స్, టీజర్, పోస్టర్లు ఆకట్టుకున్నాయి. తాజాగా, 'మిరాయ్' నుంచి మేకర్స్ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. చుట్టూ పురాతన దేవాలయాలు, శిథిల భవనాల మీదుగా హీరో ఎగురుతున్నట్లుగా ఉన్న ఈ ఫొటో మూవీపై ఆసక్తిని పెంచుతోంది. 'గత సంక్రాంతికి ఎగరడం ప్రారంభించా. మీ ప్రేమతో ఇప్పటికీ దాన్ని కొనసాగిస్తున్నా' అని తేజ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సూపర్ హీరో రేంజ్‌లో ఈ పోస్టర్ వైరల్ అవుతుండగా.. సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. ఇందులో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, మరాఠీ భాషల్లో ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సమంతపై కీర్తి సురేశ్ ప్రశంసలు

స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ 'బేబీ జాన్' సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం సినిమాలకు గ్యాప్ ఇచ్చి తన భర్తతో మ్యారీడ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తోంది. తాజాగా, హీరోయిన్ సమంతపై ప్రశంసలు కురిపించారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంతకు కీర్తి సర్‌ప్రైజ్ వాయిస్ మెసేజ్ పంపారు. ఇక ఆ మెసేజ్‌లో కీర్తి సురేష్.. 'సమంత.. నీతో ఉన్న అనుబంధాన్ని ఎలా వర్ణించాలి, ఎక్కడ నుంచి ప్రారంభించాలో తెలియడం లేదు. మనం కలిసింది కొన్ని సార్లే అయినా.. ఎన్నో ఏళ్ల క్రితం నుంచి కలిసి ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఏ విషయంలోనైనా సూటిగా వ్యవహరిస్తావు. మహిళల కోసం ముందుంటావు. నాకు ఎన్నో విషయాల్లో స్ఫూర్తిని ఇస్తుంటావు. నిన్ను ఫ్రెండ్ అనడం కంటే సిస్టర్ అని పిలవడం నాకిష్టం. జీవితంలో ఎదురైన ఎన్నో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొన్నావు. ఇలాంటి పోరాటాలు చేయడం నీకు మాత్రమే సాధ్యం. జీవితం నీకు ఎన్ని సవాళ్లు విసిరినా రెప్పింపు బలంతో వాటిని ఎదుర్కొన్నావు. ఈ విషయంలో నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంటుంది' అని వాయిస్ మెసేజ్ పంపారు. దీనిపై సమంత కీర్తి సురేష్‌కి థ్యాంక్స్ చెప్పారు.



## సితార ఎంటర్‌టైన్‌మెంట్స్
# ప్రొడక్షన్ నెం. 32

'బేబీ' చిత్రంతో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య ద్వయం సంచలన విజయం సాధించింది. అలాగే '90s' వెబ్ సిరీస్ తో దర్శకుడు ఆదిత్య హాసన్ ప్రతి కుటుంబానికి చేరువయ్యారు. ఇప్పుడు ఈ ముగ్గురు యువ సంచలనాలతో వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, తమ ప్రొడక్షన్ నెం. 32ని ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాతలు అనౌన్స్ మెంట్ వీడియోను విడుదల చేశారు. '90s' సిరీస్ లో చిన్న పిల్లవాడు ఆదిత్య పాత్ర ఎంతలా ప్రేక్షకుల మనసులను గెలుచుకుందో తెలిసిందే. ఆ పిల్లవాడు పది సంవత్సరాల తర్వాత పెద్దవాడైతే, ఆ పాత్రను ఆనంద్ దేవరకొండ పోషిస్తే, అతనికి ఒక అందమైన ప్రేమ కథ ఉంటే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచి ఈ చిత్ర కథ పుట్టినట్లుగా అనౌన్స్ మెంట్ వీడియోలో చూపించారు. "మీరు టీవీలో మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా చూశారు కదా. ఇప్పుడు థియేటర్లో ఒక మిడిల్ క్లాస్ బాయ్ లవ్ స్టోరీ చూడండి. ఇది నా స్టోరీ, నీ స్టోరీ, కాదు కాదు మన స్టోరీ. మోస్ట్ రిలేటబుల్ లవ్ స్టోరీ." అంటూ వీడియో చివర్లో ఆనంద్ చెప్పిన డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రం కామెడీ, రొమాన్స్, ఎమోషన్, డ్రామా కలయికతో అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా రూపొందనుంది. తన మధురమైన మెలోడీలతో ప్రపంచవ్యాప్తంగా హృదయాలను గెలుచుకున్న సంగీత సంచలనం హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ నవీన్ నూలి, '90s' సిరీస్ లో తన అసాధారణ ప్రతిభతో ప్రశంసలు పొందిన ఛాయాగ్రాహకుడు అజీమ్ మొహమ్మద్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై బ్లాక్ బస్టర్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రకటన వీడియోతోనే ఈ చిత్రం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. యువ దర్శకుడు ఆదిత్య హాసన్, 'బేబీ' ద్వయంతో కలిసి మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి సిద్ధమవుతున్నారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## 'గేమ్ ఛేంజర్' అవుట్ పుట్‌పై డైరెక్టర్ శంకర్ షాకింగ్ కామెంట్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్ లో తెరకెక్కిన గేమ్ ఛేంజర్ మూవీ జనవరి 10న థియేటర్లోకి వచ్చింది. మొదటి నుంచి మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మూడేళ్ల క్రితమే షూటింగ్ ప్రారంభించిన ఈ సినిమా ఈ ఏడాది థియేటర్లోకి వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఊహించని విధంగా టాక్ అందుకుంది. సంక్రాంతి బ్లాక్ బస్టర్ హిట్ ఖాయమని ఆశపడ్డ బెగా అభిమానులు నిరాశ పరిచింది. డివైడ్ టాక్ తెచ్చుకున్న గేమ్ ఛేంజర్ పై రిజల్ట్ పై తాజాగా డైరెక్టర్ శంకర్ స్పందించారు. ఈ సందర్భంగా మూవీపై ఆయన చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. గేమ్ ఛేంజర్ అవుట్ పుట్ తో తాను సంతృప్తిగా లేనన్నారు. 'నేను అనుకున్న ప్రకారం ఈ సినిమా 5 గంటల నిడివి వరకు ఉండాలి. కానీ, సమయాభావం వల్ల కొన్ని సీన్స్ కట్ చేయాల్సి వచ్చింది. దాని వల్ల కథ అనుకున్న విధంగా రాలేదు. గేమ్ ఛేంజర్ తో నేను చెప్పాలనుకుంది చెప్పలేకపోయా' అంటూ చెప్పుకొచ్చారు. అలాగే గేమ్ ఛేంజర్ కి రామ్ చరణ్, ఎస్ జే సూర్యల నటనే బలం అన్నారు. వారి యాక్టింగ్ పై ప్రశంసలు కురిపించారు. ఆ తర్వాత ఇంతవరకు ఆన్ లైన్ రివ్యూలు తాను చూడలేదన్నారు. తనకు తెలిసినంత వరకు వరకు గేమ్ ఛేంజర్ కు మంచి రివ్యూలు వచ్చినట్టు విన్నాను అన్నారు. దీంతో ఆయన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఓ దర్శకుడిగా సినిమా రిలీజ్ తర్వాత టాక్ ఎలా ఉంది, రివ్యూలు ఎలా వచ్చాయనేది కనీసం తెలుసుకోవాల్సిన అంశమని, అలాంటిది ఆన్ లైన్ రివ్యూస్ చూడలేదనడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు రివ్యూలు చూడకుండ ప్రజలు ఏం కోరుకుంటున్నారు, ఈ జనరేషన్ ఆలోచనలు ఎలా తెలుస్తాయంటూ కామెంట్స్ చేస్తున్నారు.







## అనుష్క 'ఘాటి'.. విక్రమ్ ప్రభు ఫస్ట్ లుక్ రిలీజ్

అనుష్క ప్రధాన పాత్రలో దర్శకుడు క్రిష్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఘాటి'. ఇందులో తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ప్రత్యేక వీడియోను బుధవారం విడుదల చేసింది. విక్రమ్ ప్రభు పోషిస్తున్న దేశీరాజు పాత్రకు సంబంధించిన యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాలో అనుష్క ట్రైబల్ అమ్మాయి పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. దేశంలోని కొండ లోయలలో నివసించే జీవితాల ఆధారంగా ఈ సినిమా రానుంది. ఇందులో అనుష్క ఒక బాధితురాలి నుంచి క్రిమినల్‌గా, అనంతరం లెజెండ్‌గా ఎలా మారింది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే అంటూ మేకర్స్ తెలిపారు. ఇక కొండపోలం వంటి భారీ డిజాస్టార్ తర్వాత క్రిష్ దర్శకత్వంలో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్ తెరకెక్కిస్తుంది. ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఏప్రిల్ 18న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com